వైఎస్ఆర్
కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 11 జూన్ 2026

## ప్రభుత్వ బడులలో అద్భుత ఫలితాలు




**ప్రొద్దుటూరు అర్బన్ , జూన్ 10, ప్రభాతవార్త:**
మున్సిపల్ పరిధిలోని 33వ వార్డ్ సమీపంలో ఉన్న ఎస్వివి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల యందు బుధవారం"బడి పండుగ "కార్యక్రమాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు తీసుకొచ్చిన మార్పులు అమోఘమని ఉదాహరణకు ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి తల్లికి వందనం 15.000 చొప్పున తల్లి అకౌంట్లో జమ చేయించడం, రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా విద్యార్థులచే అసెంబ్లీ నిర్వహణ, స్టేట్ ర్యాంకర్లకు పత్రికలలో ఫోటోలు వేయించుట, తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం, ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు డొక్కా సీతమ్మ మధ్యాహ్నా భోజన పథకాల తీసుకురావడం ద్వారా విద్యా వ్యవస్థలో సంచలన మార్పు తీసుకురావడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో 33 వ వార్డు మాజీ కౌన్సిలర్ గాజుల శివ జ్యోతి,స్కూలు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యా కమిటీ వారు పాల్గొన్నారు

## ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

### డీఈ రమణయ్య


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డీఈ రమణయ్య

**కలికిరి, జూన్ 10, ప్రభాతవార్త:**
మండలంలోని గ్రామ పంచాయతీలలో గత ప్రభుత్వంలో మంజూరై నిర్మాణాలు వివిధ స్థాయిల్లో ఉన్న ఇంటి నిర్మాణ పనులను ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వేగవంతం చేయించాలని పీలేరు డివిజన్ హౌసింగ్ డీఈ రమణయ్య పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో భానుమూర్తిరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఈ మాట్లాడారు. మండలానికి 1659 ఇళ్లు మంజూరు కాగా వాటిలో 1100 ఇళ్లు నిర్మాణాలు పూర్తి కావడం జరిగిందన్నారు. 508 ఇళ్లు ప్రారంభం కాలేదన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు గ్రామాల్లో పర్యటించి ఇంటి నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# మోతాదు...మించుతున్నారు..

### నియోజకవర్గంలో బారీగా యూరియా వినియోగం
### భూసారం దెబ్బతింటుందంటున్న నిపుణులు
### తగ్గించేందుకు వ్యవసాయ అదికారుల చర్యలు



**మదనపల్లె, జూన్ 10 ప్రభాతవార్త :**
మదనపల్లె ప్రాంతాల్లోని రైతులు యూరియా వినియోగం భారీగా పెరిగింది. వ్యవసాయ నిపుణులు చేసిన సర్వేలో ఈ విషయం బయటపడింది. రైతులు త్వరగా వరి పెరిగేందుకు యూరియాను ఎక్కువుగా వినియోగిస్తున్నారు. దీని వల్ల భూముల్లో భూసారం దెబ్బతినడంతో పాటు పురుగులు ఆశిస్తున్నాయని వ్యవసాయ నిపుణులు, అదికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు అవగాహన కల్పి ంచే ప్రయత్నం చేస్తున్నారు. యూరియా వాడకాన్ని తగ్గించాలని రైతులను కోరుతున్నారు. ప్రతి మండలంలో ఈ ఏడాది పంటలు ఎక్కువుగా వేశారు. ఈ పంటల కోసం నియోజకవర్గంలోని అన్ని మండలాల రైతులు ఎరువులను ఎక్కువుగా వినియోగించారు. సగటు వినియోగం కన్నా ఎక్కువుగా వినియోగిస్తున్నారు. పంటలు త్వరగా పెరగాలని, దిగుబడి ఎక్కువ రావాలని వీటిని వినియోగిస్తున్నారు. పంటలు బాగా పెరుగుతుండడం వల్ల వ్యవసాయ నిపుణులు పంటలను డివిజన్ లోని పంటలను పరిశీలించారు. ఎరువులు, పురుగుల మందుల వినియోగాన్ని కూడా పరిశీలించారు. మదనపల్లె జిల్లాకేంద్రంలోని పెద్ద పెద్ద మండలాలు మదనపల్లె, పుంగనూరు, పీలేరు, తంబళ్ళపల్లె, పెద్దమండ్యం, కొత్తకోట, మొలకలచెరువు, గుర్రంకొండ, కలకడ వంటి మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో పంటలకు యూరియాను అధికంగా వాడుతున్నట్లు గుర్తించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని నిపుణులు ప్రభుత్వానికి నివేదించారు. ఎరువుల మోతాదుకు మించి పంటలకు వేస్తే భూసారం దెబ్బతింటుందని మళ్ళీ పంటలు వేస్తే దిబుగడి రాదని నిపుణులు తెలుపుతున్నారు. జిల్లాలో ఎరువులు, పురుగుల మందులు వినియోగించడం వల్ల దిగుబడి రాకపోగా రైతులపై అదనపు భారం పడుతుందంటున్నారు. ఇదే రకంగా ఎరువులు వేయడంతో పంటలు దెబ్బతినడంతో పాటు పురుగుల ఆశిస్తాయని తెలిపారు. వరి పంటలతోపాటు మరి కొందరు రైతులు మొక్కజొన్న పసుపు, జొన్న, సజ్జ, రాగి పంటలతోపాటు ఇతర పంటలను వేశారు. వరిసాగు చేస్తున్న రైతులు కాంప్లెక్స్ ఎరువుతో పాటు ఎకరాకు మూడు బస్తాల యూరియాను వాడుతున్నారు. ప్రతి పంటకు దాదాపు నాలుగు బస్తాల ఎరువులను వేస్తున్నారు. వరిపంటకు ఒక బస్తా కాంప్లెక్స్ ఎరువుతో పాటు రెండు బస్తాల యూరియా సరిపోతుందని నిపుణులు చెప్పుకొస్తున్నారు. వరికే కాకుండా ఇతర పంటలకు కూడా యూరియాను అధిక మోతాదుల్లో వినియోగిస్తున్నారు. శాస్త్రవేత్తలు నిర్ణయించిన దానికన్నా రైతులు ఎక్కువుగా వినియోగించడం వల్ల భూముల్లో సారం దెబ్బతిని భవిష్యత్తులో పంటలు వేసినా దిగుబడి రాని పరిస్థితి ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. రైతులకు అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఏదిఏమైనా పంటలు బాగా పండాలని, కాపు బాగా రావాలన్న ఉద్దేశ్యంతో యూరియాను అధికంగా వాడుతున్నారు. ఇలాంటి రైతులకు సంబంధిత అధికారులు సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఇంటర్ తరగతుల ప్రారంభం

### పేదింటి పిల్లలకు ఉచిత పథకాలు

**పీలేరు జూన్ 10 ప్రభాతవార్త:**
ఇంటర్మీడియట్ విద్యార్థులకు వేసవి సెలవులు ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా శనివారం నుంచి కళాశాలలు పునః ప్రారంభం కానున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కళాశాలల్లో మధ్యాహ్నా భోజనం పథకాన్ని పునరుద్ధరించింది. మరోవైపు సర్వేపల్లి రాధాకృ ష్ణన్ విద్యార్థి మిత్ర పథకం ద్వారా పాఠ్య, రాత పుస్త కాలు, బ్యాగ్లను ఉచితంగా అందిస్తోంది. ఇప్పటికే ద్వితీయ ఏడాది విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. మొదటి ఏడాది ప్రవేశాలు పొందే వారికీ ఈ పథకాలు వర్తింపజేయనున్నారు.

**నీట్... జేఈఈకు శిక్షణ**

గత విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులను కార్పొరేట్ కు దీటుగా పలు సంస్కరణలు చేపట్టారు. కళాశాలలోనే నీట్, జేఈఈ, ఎంసెట్ కు శిక్షణ కార్యక్రమాలు అమలు చేశారు. సంబంధిత మెటీరియల్ ఉచితంగా అందించారు.

**సంకల్ప్ ప్రమాణాల పెంపు**

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ఉత్తీర్ణత శాతం పెంపునకు సంకల్ప్2026ను అమలు చేసింది. 2025లో శ్రీకారం చుట్టిన ఈ కార్యక్రమంలో సాదారణ పరీక్షల్లో సాదించిన మార్కుల ఆధారంగా విద్యార్థులను మూడు వర్గాలుగా విభజించారు. బాగా చదువుతున్నవారు ఎ, మధ్యస్థం బి, వెనుకబడిన వారిని సి కేటగిరీలుగా విభజించారు. అందర్నీ ప్రతిభావంతు లుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక దృష్టిసారిస్తూ ప్రణాళిక సిద్ధం చేశారు. పరీక్షలు పూర్తయ్యాక ద్వితీయ ఏడాదికొచ్చే విద్యార్థులకు నెల రోజులు తరగతులు నిర్వహించారు. దీంతోపాటు సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి ప్రత్యేక తరగతులు అమలు చేశారు.

**సర్వం సిద్ధం..**

జిల్లాలో ఇంటర్ కళాశాలల పునఃప్రారంభానికి సర్వం సిద్ధమైంది. ఈ నెల ఒకటి నుంచి ప్రారంభం కావాల్సి ఉన్నా.. సప్లిమెంటరీ పరీక్ష 5వ తేదీన జరిగినందున సెలవులను అయిదు రోజుల పాటు పొడిగించారు. ద్వితీయ ఏడాది విద్యార్థులకు పుస్తకాలు అందించారు. ప్రథమ ఏడాదికి సంబంధించి సిద్ధంగా ఉన్నాయని మదనపల్లె డీఐఈవో రవి నాయక్ పేర్కొన్నారు.

## సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

### సర్వేయర్లు తహసీల్దార్లతో జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనా


సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నిధి మీనా

**పులివెందుల, జూన్ 10, ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ రీసర్వే కార్యక్రమాన్ని సర్వేయర్లు పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనా అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ చిన్నయ్య సమక్షంలో నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లు, సర్వేయర్లు మరియు సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, భూములపై జరుగుతున్న రీసర్వే పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే నిర్వహించే సమయంలో రైతుల పాస్ పుస్తకాలు, ఇతర భూ సంబంధిత పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి ఖచ్చితమైన సర్వే చేపట్టాలని సూచించారు. సేకరించిన వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. రీసర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరిం చాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా పనులు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా రీసర్వే పనులను పూర్తి చేయడానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.ఈ సమావేశంలో ఆర్డీఓ చిన్నయ్య, పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్, నియోజకవర్గంలోని తహసీల్దార్లు, సర్వేయర్లు మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### పీహెచ్‌సీల్లో సేవల నాణ్యత

## మరింత మెరుగుపడాలి

### మందులు, వైద్య పరికరాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలి..
### వ్యాక్సినేషన్ లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలి..
### జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్..



**రామాపురం, జూన్ 10 ప్రభాతవార్త:**
రామాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఉదయం 9.30 గంటలకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, మందుల నిల్వలు, వైద్య పరికరాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీహెచ్‌సీల్లో అవసరమైన అన్ని రకాల మందులు, వైద్య పరికరాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లేబర్ రూమ్‌లో నిర్దేశిత ప్రోటోకాల్స్‌ను కచ్చితంగా పాటించాలని, పరికరాలను స్టెరిలైజేషన్ చేసి పరిశుభ్రంగా నిర్వహించాలని ఆదేశించారు. ఆక్సిజన్ ప్లాంట్ నిరంతరం పనిచేసే స్థితిలో ఉండేలా పర్యవేక్షించాలని, అత్యవసర పరిస్థితుల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తెలిపారు. సబ్‌సెంటర్ల వారీగా వ్యాక్సినేషన్ పురోగతిని సమీక్షిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికి టీకాలు అందించి లక్ష్యాలను 90 శాతానికి పైగా సాధించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పీహెచ్‌సీ పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, డ్రైనేజీ సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పీహెచ్సీకి విచ్చేసిన ప్రజలతో వైద్య సేవలు అందుతున్న తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి అంశాన్ని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ తనిఖీలో వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఓటర్ల జాబితా సవరణపై రెండో రోజు

## కొనసాగిన శిక్షణ




**బద్వేల్, జూన్ 10, ప్రభాతవార్త**
భారత ఎన్నికల సంఘం, న్యూఢిల్లీ మరియు చీఫ్ ఎలెక్షన్ అధికారి, అమరావతి ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల అధికారి, కడప సూచనలతో ప్రత్యేక ముమ్మర సవరణ కార్యక్రమంలో భాగంగా బద్వేల్ ఎన్నికల నమోదు అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి ఎ. చంద్రమోహన్ ఆధ్వర్యంలో బుధవారం బూత్ స్థాయి అధికారులు (సూపర్వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ ద్వారా సర్ కార్యక్రమం ఉద్దేశాలు, విధివిధానాలపై అవగాహన కల్పించారు. ఓటర్ల జాబితాలో ఉన్న మరణించిన వారు, రెండు చోట్ల ఓటు కలిగిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, వివాహం కారణంగా వేరే ప్రాంతాలకు వెళ్లిన మహిళలు, వలస వెళ్లిన వారి వివరాలను గుర్తించి ఓటర్ల జాబితాను తప్పులు లేకుండా శుద్ధి చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న 2025 ఓటర్ల జాబితాను 2002 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. జూన్ 15 నుంచి జూలై 14 వరకు 30 రోజులపాటు ప్రతి బూత్‌స్థాయి అధికారి ఇంటింటికి వెళ్లి ప్రతి ఓటరుకుఎన్యుమరేషన్ ఫారం అందజేసి డిక్లరేషన్ ఫారం సేకరించనున్నట్లు ..మిగతా 2వ పేజీలో

### ముఖ్యమంత్రిచే సిటిఎం

## రోడ్డును ప్రారంభిస్తాం

### మదనపల్లె రైతుబజార్‌లో చేపలు, చికెన్ షాపులు ఏర్పాటు
### ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



**మదనపల్లె, జూన్ 10 ప్రభాతవార్త :**
మదనపల్లె మున్సిపల్ పరిధిలోని వారపుసంత సమీపంలో ఉన్న రైతుబజార్‌ను ఎమ్మెల్యే షాజహాన్ బాషా బుధవారం పరిశీలించారు. ఎమ్మెల్యేతో పాటు జిల్లా మార్కెటింగ్‌శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ త్యాగరాజు, మున్సిపల్ కమిషనర్ ప్రమీలలు రైతుబజార్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుబజార్‌లోకి చేపలు, చికెన్ మార్కెట్‌లను కూడా తరలిస్తే బాగుంటుదని తెలిపారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి వారపుసంత సమీపంలో చేపలు, మాంసపు విక్రయాలు ఒకే చోట ఏర్పాటు చేస్తే ప్రజలకు అటు కూరగాయాలు, ఇటు మాంసపు మార్కెట్‌కు అందుబాటుగా ఉండడంతో ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. దీంతో జాతీయ రహదారిలో ట్రాఫిక్ సమస్య తగ్గించవచ్చనని అదికారులతో చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందకుమార్, నవీన్‌చౌదరి, సురేంద్రరెడిడ, కత్తి లక్ష్మన్న, ఇక్బాల్, జాన్‌బాబు, ఎర్రబెల్లి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ముఖ్యమంత్రిచే సిటిఎంరోడ్డును ప్రారంభిస్తాం : ఎమ్మెల్యే**

సిటిఎం రోడ్డును సిఎం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ఆర్‌అండ్‌బి ఈఈ అరవిందదేవి, ఏపిట్రాన్స్‌కో డిఈ గంగాధర్, మున్సిపల్ కమిషనర్ ప్రమీలతో కలసి రూ.3.50కోట్లతో చేపట్టనున్న నిర్మాణ పనులను పరిశీలించారు. డ్రైనేజి, తారురోడ్డు నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయడం జరుగుతుందన్నారు. సిఎం పర్యటన నేపథ్యంలో ఈ రోడ్డును ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు టిడిపి నాయకులు బాబుస్వామి, నవీన్‌చౌదరి, షంషీర్, రఘుపతినాయుడు, మల్లికార్జుననాయుడు. ఇక్బాల్, నందకుమార్, జేసిబివేణు తదితరులు పాల్గొన్నారు.

### పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త

# అంకితభావంతో పని చేయాలి

### ఒక్క ఓటు కూడా పోకూడదు..
### అన్యాయం జరగ్గకూడదు..
### టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు


ఎస్ఐఆర్ సమావేశంలో మాట్లాడుతున్న జగన్మోహన్ రాజు

**రాజంపేట, జూన్ 10 ప్రభాతవార్త:**
నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేయాలని, సర్ కార్యక్రమంలో అర్హులకు ఒక ఓటు కూడా పోకూడదని, ఓటర్ జాబితాలో అర్హులు ఉండకూడదని టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు అన్నారు. బుధవారం స్థానిక ఏబి చంద్రారెడ్డి కళ్యాణ మండపంలో స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్పై నియోజకవర్గస్థాయి కార్యక్రమం నిర్వహించారు.నియోజకవర్గ అబ్జర్వర్ భీమినేని చిట్టిబాబుతో కలిసి సర్ పై పార్టీ శ్రేణుల అనుమానాలకు, అపోహలకు సవివరంగా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హుడైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా కార్యకర్తల కృషి చేయాలని పేర్కొన్నారు.పార్టీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి ఓటరు వివరాలను పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. బిఎల్వోలు చేస్తున్న ఓటర్ మ్యాపింగ్ ను ప్రతి ఒక్క ఓటరు మ్యాపింగ్ చేయించుకోవాలని తెలియజేశారు.అలా చేయించుకొని పక్షంలో ఓటు తొలగిపోయే ప్రమాదం ఉంది కాబట్టి ప్రతి ఒక్కరు ఓటర్ మ్యాపింగ్ చేయించుకోవాలని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ నెల 15 నుండి జూలై 14 వరకు జరిగే సర్వే కార్యక్రమాన్ని పార్టీ నాయకులు సమన్వయంతో విజ యవంతం చేయాలని తెలియ జేశారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.దొంగ ఓటర్లకు ఎటువంటి అవకాశం లేకుండా చూసుకోవాలని పార్టీ శ్రేణులకు తెలియజేశారు.కొత్త ఓటర్లను చేర్చాలన్న, దొంగ ఓటర్లను తొలగించాలన్న,బిఎల్వో లకు సమాచారం ఇవ్వాలని, పార్టీ బిఎల్ఎ లను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్స్ అద్దేపల్లి ప్రతాప్ రాజు, డాక్టర్ వీరభద్రుడు,మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బ నరసయ్య నాయుడు,వైస్ చైర్మన్ కర్ణాటకం చెంగల్ రాయుడు,ఒంటిమిట్ట జడ్పిటిసి ముద్దుకృష్ణారెడ్డి,మాజీ రాష్ట్ర డైరెక్టర్ మోదుగుల పెంచలయ్య,మాజీ ఆర్టీసీ రీజినల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, సొసైటీ చైర్మన్లు ముల్లగూరి సుబ్రహ్మణ్యం నాయుడు,పసుపులేటి ప్రవీణ్ కుమార్,దశరథ రామనాయుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి శనివారపు మోహన్ రెడ్డి,పార్లమెంట్ అధికార ప్రతినిధి దొంతం శివప్రసాద్,పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు అనసూయదేవి,సీనియర్ నాయకులు కొండూరు శరత్ కుమార్ రాజు,మండలాల అధ్యక్షులు జంగం శెట్టి సుబ్బయ్య, రాజశేఖర్ యాదవ్,రవికుమార్ నాయుడు, భాను గోపాల్ రాజు, రమేష్ నాయుడు,గజ్జల నరసింహారెడ్డి,యూనిట్ ఇన్చార్జిలు,క్లస్టర్ ఇంచార్జిలు, బూత్ కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికి స్వచ్ఛ తాగునీరు అందించడమే కూటమి లక్ష్యం

జనసేన ఇంచార్జ్ పోతుల సాయినాథ్



**తంబళ్లపల్లె, జూన్10, ప్రభాతవార్త :** గత అవినీతి వైకాపా పాలనలో సాగునీరు, తాగునీటికి కటకటలాడిన తంబళ్లపల్లె ప్రజానీకానికి హంద్రీనీవాతో సాగునీరు, జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛ తాగునీరు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తున్నట్లు తంబళ్లపల్లె జనసేన పార్టీ ఇంచార్జ్ పోతుల సాయినాథ్ ధీమాగా చెప్పారు. బుధవారం మండలంలోని ఆర్ ఎన్ తాండ పంచాయతీ ఎద్దుల వారి కోటలో జల్జీవన్ మిషన్లో భాగంగా 60 వేల లీటర్ల సామర్థం గల ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులకు ఆయన పూజలు చేసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏఈఈ వినోద్ కుమార్ మాట్లాడుతూ మండలంలో తంబళ్లపల్లెలో90 వేల లీటర్ల తర్వాత 60 వేల లీటర్ల సామర్థంతో అతిపెద్ద ట్యాంక్ నిర్మాణం తో మారుమూల ప్రజల కు స్వచ్ఛ జలాలు అందించడం జరుగుతుందన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీటి పథకం నిర్మాణాలపై స్థానిక కూటమి నాయకులు,ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్ సంజయ్, మాజీ సర్పంచ్ సిద్ధమల్ రెడ్డి, జనసేన నాయకుడు ఎద్దుల నరసింహులు, టిడిపి నాయకులు జి నరసింహులు, వీరాంజనేయులు, మోహన్ బాబు, సురేంద్ర, చిన్న రెడ్డప్ప, జగదం అనిల్, రోహిత్ కుమార్, రాకేష్, నాగేంద్ర కూటమి నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

# పిల్లల్లో పోషకాహార లోపాన్ని గుర్తించాలి

### పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు నిపుణుల సలహాలు ముఖ్యం
### మండల విద్యాశాఖ అధికారి



**గాలివీడు జూన్ 10: ప్రభాత వార్త**

కొన్ని లక్షణాల ద్వారా పిల్లల్లో పోషకాహార లోపాన్ని నిపుణులు ద్వారా గుర్తించవచ్చు నని తద్వారా సమస్యను ముందే పరిష్కరించు కోవచ్చని గాలివీడు ఎంఈఓ 2 శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో నీ స్థానిక ఆయుష్ చిల్డ్రన్ హాస్పిటల్ ఆవరణలో జరిగిన పిల్లల్లో పోషకాహార లోపాన్ని గుర్తించాలి.పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు.. పిల్లలకు ఆరోగ్యవంతమైన ఆహారం అందించడానికి పిల్లల తల్లితండ్రుల తో జరిగిన అవగాహన సదస్సు లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయుష్ చిల్డ్రన్ హాస్పిటల్ డాక్టర్ మహేష్ నాయక్ డాక్టర్ వినూత లు పిల్లల్లో పెరుగుతున్న పోషకాహార లోపాన్ని గుర్తించడంలో దానికి సంబంధించిన ఉత్పత్తులు ఆవిష్కరించడం స్టాల్ను ఏర్పాటు చేయడం వారి కృషి పట్టుదల అమోఘం అన్నారు. డాక్టర్ మహేష్ నాయక్ డాక్టర్ వినూతలు మాట్లాడుతూ ఈ రోజుల్లో చాలామందిని ఆందోళన పిల్లలో పోషకాహార వంటి సమస్యలు వేధిస్తున్నాయి. వీరిలో పిల్లలూ ఉంటున్నారు. అయితే ఈ సమస్యలకు పోషకాహార లోపం కూడా కారణముకూడా.. ప్రొటీన్లు మెదడు పనితీరును కూడా ప్రభావితం చేస్తుంటాయి. మనం తీసుకునే ఆహారంలో ఇవి లోపించినప్పుడు ఆందోళన, పిల్లల్లో పాలు సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి పిల్లలకిచ్చే ఆహారంలో ప్రొటీన్లు తగినంత తగా ఉండేలా జాగ్రత్తపడాలి. అనంతరం ఆయుష్ చిల్డ్రన్ హాస్పిటల్ వారి టమ్మీ టాట్స్, మిలెట్ కుకీస్ సెరే లవ్ మిల్క్ మిక్స్ ఉత్పత్తుల ప్రముఖులు రిబ్బన్ కట్ చేసి స్టాల్ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండలంలోనీ పలువురు ఉపాధ్యాయలు, ప్రవేట్ స్కూల్ యాజమాన్యాలు,పలు మెడికల్ స్టార్ ఫార్మసిస్టులు. గ్రామ పెద్దలు. పిల్లల తల్లితండ్రులు ఆయుష్ హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీలో కొబ్బరి చెట్ల పెంపకానికి ప్రాధాన్యత : ఏపీడి చందన



**తంబళ్లపల్లె జూన్ 10 ప్రభాతవార్త ః** తంబళ్లపల్లె మండలంలో ఉపాధి హామీ పథకంలో హార్టికల్చర్ కొబ్బరి చెట్ల పెంపకానికి ప్రాధాన్యత నివ్వాలని ఏపీడి చందన సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన క్షేత్ర సహాయకులు సమీక్షలో ఆమె మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న జలధార, జలహారతి పనులు త్వరగా పూర్తి చేసి ప్రతి సాగునీటి చెరువులు నీటితో కళకళలాడాలని సూచించారు. ఉపాధి హామీలు హార్టికల్చర్ లో భాగంగా ప్రకృతి వ్యవసాయంతో రైతులు కోరిన పండ్ల మొక్కల పెంపకానికి రైతులతో మాట్లాడి ఒప్పించాలన్నారు. మండలంలో మొదటి ప్రాధాన్యత క్రమంలో 200 ఎకరాలలో పండ్ల మొక్కల పెంపకానికి క్షేత్ర సహాయకులు కృషి చేయాలన్నారు. మండలంలో జలధార, జలహారతి కార్యక్రమంలో జరిగే ప్రతి పని ప్రతి నీటి బొట్టు సంరక్షణే ధ్యేయంగా పనులు చేయించాలన్నారు. ఎంపీడీవో ఎంవి ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న జలధార,జలహారతి పనుల నిర్వహణ పై అభినందిస్తూ మిగిలిన పనులు పూర్తిచేసి జల సంరక్షణకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ అంజనప్ప, ఈసీ మహేష్, టెక్నికల్ అసిస్టెంట్లు సుజాత, బాల గంగాధర్, భూదేవి, కంప్యూటర్ ఆపరేటర్లు రమేష్, సరస్వతి, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## రైతు ఉత్పత్తి కేంద్రం ద్వారా వ్యవసాయ పరికరాలు: ఏపిఎం గంగాధర్



**తంబళ్లపల్లె జూన్ 10 ప్రభాతవార్త ః** తంబళ్లపల్లె మండలంలోని రైతాంగానికి రైతు ఉత్పత్తి కేంద్రం ద్వారా వ్యవసాయ పరికరాలు తక్కువ ధరకే లీజ్కు అందుబాటులో ఉంటాయని వెలుగు ఏపిఎం గంగాధర్ తెలిపారు. బుధవారం రైతు ఉత్పత్తిదారుల సంఘ సమావేశం జరిగింది. ఎఫ్ పీ ఓ కేంద్రం ద్వారా ట్రాక్టర్, వ్యవసాయ పరికరాలు, ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన విత్తనాలు మండలంలోని మహిళా రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇండియన్ బ్యాంక్ మేనేజర్ ఎస్.ఎండి. మంజూర్ ఇలాహీ మాట్లాడుతూ మహిళా సంఘాలకు రుణ సౌకర్యం అందించడానికి ముందు ఉంటామనిఈ ఆర్థిక ఏడాది రూ ఐదు కోట్ల రుణ పంపిణీకి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ బి ఓ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, వెలుగు మండల సమైక్య అధ్యక్షురాలు రామ లక్ష్మమ్మ, వెలుగు సీసీలు కత్తి నరసింహులు, రమణ, ఆదిలక్ష్మి, మహిళా సమైక్య సభ్యులు, ఎఫ్ పి ఓ సభ్యులు పాల్గొన్నారు.

## లక్కిరెడ్డిపల్లి మోడల్ స్కూల్లో మిగిలిన సీట్లకు ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**లక్కిరెడ్డిపల్లి,జూన్ 10. ప్రభాతవార్త:** లక్కిరెడ్డిపల్లి ఏపీ మోడల్ స్కూల్లో 2026,27 విద్యా సంవత్సరానికి సంబంధించిన మిగిలిన సీట్లు 6, 7, 8, 9 తరగతి లకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశం కొరకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ వారాల రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 వ తేదీ నుండి జూన్ 20వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని పిల్లలకు 24 వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ఈ పరీక్షలో ఎంపికైన అభ్యర్థులను 25వ తేదీన పలితాలు విడుదల చేసి మార్కుల మెరిట్ ప్రకారం 26 నుంచి విద్యార్థులను పాఠశాలలో చేర్చుకుంటామన్నారు. ఈ ఏడాది మార్చిలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో పాస్ అయిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చున్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఏపీ మోడల్ స్కూల్ నందు అప్పగించాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవచ్చున్నారు.

## చిన్నమండెంలో ఘనంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం

.ముఖ్య అతిథులుగా పాల్గొన్న అబ్జర్వర్ అన్నా అనిత యాదవ్ , చిన్నమండెం మండల అధ్యక్షులు ముగి రెడ్డప్ప



**చిన్నమండెం,జూన్ 10, ప్రభాతవార్త:** మండలంలో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అబ్జర్వర్ అన్నా అనిత యాదవ్, మండల అధ్యక్షులు ముగి రెడ్డప్ప హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అబ్జర్వర్ అన్నా అనిత యాదవ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. మండల అధ్యక్షులు ముగి రెడ్డప్ప మాట్లాడుతూ జూన్ 15 నుండి జూలై 14 వరకు జరిగే సర్వే కార్యక్రమాన్ని పార్టీ నాయకులు సమన్వయంతో విజయవంతం చేయాలని తెలిపారు. బూత్ క్లస్టర్ ఇన్చార్జులు, యూనిట్ ఇన్చార్జులు, మండల నాయకులు, గ్రామ అధ్యక్షులు మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాదర్భాష, హరి, శ్రీను,యూనిట్ ఇంచార్జిలు భాస్కర్, అశోక్, రాజు అన్నిగ్రామాల అధ్యక్షులు, బూత్ ఇంచార్జిలు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలకు స్త్రీనిధి క్రెడిట్ పాలసీ వర ప్రధాయని: ఏపిఎం గంగాధర్



**తంబళ్లపల్లె,జూన్ 10 ప్రభాతవార్త ః** వెలుగు మహిళా సంఘాలకు భవిష్యత్తులో స్త్రీనిధి క్రెడిట్ పాలసీ వర ప్రధాయనిగా నిలుస్తుందని మహిళా సంఘ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపీఎం గంగాధర్ కోరారు. బుధవారం వెలుగు కార్యాలయంలో స్త్రీనిధి మేనేజర్ అమరావతి గ్రామ సమాఖ్య సభ్యుల సమా వేశంలో 2026,2027 ఆర్థిక ఏడాదిలో స్త్రీనిధి గరిష్ట రుణ పరిమితులలో వివో, ఎస్హెచ్జిలలో ఏ,బి,సి,డి గ్రేడులుగా ప్రతిపాదించిన నూతన రుణ పరిమితులకు అనుగుణంగా అర్హతలను బట్టి రుణాల పంపిణీ జరుగుతుందన్నారు. పదిమంది సభ్యులకు వినియోగ, జీవనోపాధి రుణం ఒక్కొక్కరికి లక్ష గరిష్టంగా రూ10 లక్షలు, స్వల్పకాలిక రుణం ఒక్కొక్కరికి రూ10వేలు, గరిష్టంగా 10 మందికి లక్ష, ఉత్పాదక రుణం సంఘంలో ముగ్గురికి ఒక్కొక్కరికి రూ 2లక్షలు, గ్రూపు గరిష్టంగా రూ 6లక్షలు, అర్హతను బట్టి ఒక సభ్యురాలికి గరిష్టంగా సాధారణ రుణం లక్ష, షార్ట్ టర్మ్ రుణం రూ 10వేలు, ఎంటర్ ప్రైస్ రుణం రెండు లక్షలు మొత్తంగా రూ 3.10 లక్షల రుణం పొందవచ్చన్నారు.

## మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వెయ్యి మందికి అన్నదానం



**పీలేరు జూన్ 10 ప్రభాతవార్త:** స్థానిక మార్కెట్ యార్డ్ లోని అన్నా క్యాంటీన్ నందు మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో 1000 మందికి అన్నదానం నిర్వహించారు ఈ సందర్భంగా "కీ", శే", కాకులారం కమలమ్మ రెండో వర్ధంతి సందర్భంగా రిటైర్డ్ టీచర్ కాకులారం నల్లపురెడ్డి కుమారుడు కాకులారం మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పీలేరు మార్కెట్ యార్డ్ ఆవరణలో ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం కలిపి సుమారు వెయ్యి మందికి ఏర్పాటు చేసినట్లు మోహన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "మా అమ్మగారి జ్ఞాపకార్థం ఈ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశాం. ఆమె ఆశయాలు, ఆశీస్సులు మాపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను. ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం కంటే గొప్ప సేవ లేదని అన్నారు. అమ్మ లేని లోటు ఎవరూ తీర్చలేరు కానీ ఆమె పేరు మీద పదిమందికి సాయం చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టామని మా అమ్మ ఆత్మ శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాం. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మల్లెల రెడ్డి భాష, మార్కెట్ యార్డ్ చైర్మన్ పురం రామమూర్తి, ప్రముఖ నేత పుట్టా. రాజశేఖర్ రెడ్డి, రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టివి గోపినాథ్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి,కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కమలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

## రత్నమ్మకు న్యాయం చేయాలని తహసిల్దార్కు మాలమహానాడు నాయకులు వినతి



**పీలేరు జూన్ 10 ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని కలికిరి మండల తహసిల్దారును కలిసిన మాల మహానాడు నాయకులు కలిసి రత్నమ్మ వెంకటరమణ భూమి విషయమై తహసిల్దార్ మాల మహానాడు నాయకులు చర్చించడం జరిగింది. ఎస్.సి. కమిషనర్ ఆదేశాల మేరకు తహసిల్దార్ గారితో పత్తేగడ పంచాయతీలో మిట్టీ క్యాంపస్ ఎదురుగా ఉన్న రత్నమ్మ వెంకటరమణ భూమిని కొందరు భూ కబ్జాదారులు దొంగ పత్రాల సృష్టించి ఈ ఇరువురు భూమిని ఆక్రమించుకోవడం జరిగింది. దీనిపై మాల మహానాడు నాయకులు ఎమ్మార్వోతో మాట్లాడి మీరు మాకు భూమి చూపించకపోతే మేము ఎమ్మార్వో ఆఫీస్ ముందర ధర్నా చేపడతామని ఎమ్మార్వోకి విన్నవించడం జరిగింది. ఎమ్మార్వో స్పందించి నేను ఆ భూమి గురించి మీకు రికార్డు పరంగా అన్ని తెలియపరుస్తానని హామీ ఇవ్వడం జరిగింది దీనికి సంబంధించిన సర్వే నంబర్లు 184 బార్ టు సి కొత్త నెంబర్ 171 ఈ సర్వే నెంబర్లు పై మా భూమి మాకు చూపించాలని ఎమ్మార్వోని కోరడం జరిగింది. భూ కబ్జాదారుల బారి నుండి మా భూమిని మాకు ఇప్పించవలసిందిగా బాధితులు కోరడం జరిగింది. రత్నమ్మ భూమిని స్వాధీనం చేసుకున్న వారి నుంచి విడిపించి ఇవ్వాలని లేనిపక్షంలో తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తామని మాల మహానాడు నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాల మహానాడు అధికార ప్రతినిధి ఎస్టిడి హరి, మాల మహానాడు కార్యదర్శి చంద్రయ్య రాయల సీమ జిల్లాల అధ్యక్షులు మల్లెల మోహన, అన్నమయ్య జిల్లా మాల మహానాడు అధ్యక్షులు గుండా మనోహర, మాల మహానాడు మండల అధ్యక్షుడు సతీష్ గణేష్ పాల్గొన్నారు.

## పకడ్బందీగా జనగణన పూర్తి చేయండి



జనగణన పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

**లక్కిరెడ్డిపల్లి, జూన్ 10, ప్రభాతవార్త:** పగడ్బందీగా ఇంటింటికి వెళ్లి జనగణన పూర్తి చేయాలని ఆర్డీవో శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లి పట్టణంలో జనగణన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి ఎటువంటి పరిస్థితిలో ఆ ఇంటిలోని యజమానితో పాటు ప్రతి ఒక్కరిని నమోదు చేయాలని ఆయన సూచించారు. ఒక ఊరులో మొదటి ఇల్లు నుంచి చివరన ఇల్లు వరకు వెళ్లి వారి వివరాలు తప్పకుండా సేకరించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ క్రాంతి కుమార్, ఆర్ ఐ రాజేష్, విఆర్వోలు, స్పెషలాఫీసర్లు పాల్గొన్నారు.

## కుమ్మరిపల్లె పంచాయతీ నిధుల అవకతవకల పైన విచారణ

**రామాపురం జూన్ 10 ప్రభాతవార్త:** మండలంలోని కుమ్మరపల్లి పంచాయతీ లో నిధుల గోల్మాల్ పైన ఇటీవల వార్తాపత్రికలలో వైరల్ కావడంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఎంపీడీవో జాషువా ఆ గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ విచారణలో ఎంపీడీవో 11 లక్షల అవకతవకలకు కేవలం 94 వేల రూపాయలకే విచారణ చేసి నివేదికలు పంపించినట్లు గ్రామస్తుల సమాచారం. దీనిపైన జిల్లా ఉన్నతాధికారులు ఎంతవరకు విచారణ చేసి ఇంకా ఎంత నిధులు అవకతవకలకు పాల్పడ్డారో పూర్తి విచారణ చేస్తే గాని అధికారుల బాగోతం బయటపడదని అనుకుంటున్నారు.

## పోలియో రహిత సమాజం కోసం సహకరించండి

డాక్టర్ షణ్ముగం



**తంబళ్లపల్లె,జూన్ 10, ప్రభాతవార్త :** పోలియో రహిత సమాజం కోసం వైద్య సిబ్బంది పూర్తిస్థాయిలో సహకరించాలని కోసువారిపల్లె పీహెచ్సీ డాక్టర్ షణ్ముగం సూచించారు. బుధవారం తంబళ్లపల్లె సబ్ సెంటర్లో వైద్య సిబ్బందితో జరిగిన సమీక్షలో మాట్లాడుతూ మండలంలో జూన్ 28న జరిగే పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని 100 విజయవంతం చేసి పోలియో మహమ్మారిని తరిమికొట్టడానికి కృషి చేయాలన్నారు. వైద్య సిబ్బంది మండలంలోని విద్యుత్ సబ్ సెంటర్ల పరిధిలో క్షేత్రస్థాయిలో ప్రజలకు పారిశుద్ధంతో పాటు తాగునీటి క్లోరినేషన్, దోమల నివారణ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించి రానున్న వర్షాకాలంలో ఆరోగ్యం పై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. గ్రామాలలో గర్భిణీలు ఆసుపత్రులలో డెలివరీలకు ప్రోత్సహించి సంపూర్ణ ఆరోగ్యం కోసం తమ వంతు సహకారం అందుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగేంద్ర, ఎమ్ ఎల్ హెచ్పీ అమరావతి, మేల్ వర్కర్ కృష్ణనాయక్,ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## యోగాతోనే ఆరోగ్య మహాభాగ్యం



**లక్కిరెడ్డిపల్లి: జూన్ 10 ప్రభాతవార్త** యోగాతోనే ఆరోగ్యం మహాభాగ్యంగా ఉంటుందని ప్రతి ఒక్కరూ యోగా చేయాలని ఎంపీడీవో రెడ్డయ్య పేర్కొన్నారు. యోగా దినోత్సవం పురస్కరించుకొని బుధవారం మండల శాఖ అధికారులు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో యోగ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు దాదాపు 500 మంది ఉద్యోగులు యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగ చేయడం వల్ల శరీరం ఎంతో ఆనందంగా ఉంటుందన్నారు. యోగ వల్ల రోగాలు దూరం అవుతాయని మనిషి ఆరోగ్యంగా ఉంటాడని ప్రతి ఒక్కరూ ఉదయాన్నే యోగ తప్పనిసరిగా చేయాలన్నారు. షుగర్, బీపీలు కూడా యోగా వలన తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ క్రాంతి, ఎంఈఓ లు చక్రే నాయక్, వెంకటసుబ్బయ్య, డిప్యూటీ ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ బాబు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కొనసాగిన శిక్షణ

మొదటి పేజీ తరువాయి




వివరించారు. అలాగే తీలీవీ యాప్ లో ఎన్యుమరేషన్ ఫారాలు నమోదు చేసే విధానంపై కూడా శిక్షణ ఇచ్చారు. క్షేత్రస్థాయి పరిశీలన సమయంలో ప్రజాప్రతినిధులు నియమించిన బూత్ లెవల్ ఏజెంట్లు సహకరించాలని కోరారు. ఇదే సమయంలో 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న అర్హులైన కొత్త ఓటర్లను కూడా నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. మ్యాపింగ్ కాని ఓటర్ల జాబితాను ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శించి, అవసరమైన రెండు ఆధార పత్రాలు సమర్పించిన వారికి అవకాశం కల్పిస్తామని, అనంతరం సెప్టెంబర్ 22, 2026న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో నమోదు కావాలని, అనర్హులైన వారి పేర్లు జాబితాలో లేకుండా చూడాలని బూత్ స్థాయి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అట్లూరు, బి.కోడూరు మండల తహసీల్దార్లు అజాజ్ అహమ్మద్, ఎ.వి. రమణమ్మ, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నలక్ష్మి, అట్లూరు, బి.కోడూరు, కాశినాయన మండలాల బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## రోడ్డును పరిశీలించిన పంచాయితీ రాజ్ ఎస్ఈ




**దువ్వూరు, జూన్ 10, ప్రభాతవార్త:** మండల పరిధిలోని నీలాపురం నుంచి సుగాలితాండాకు వెళ్లే రోడ్డును పంచాయతీ రాజ్ ఎస్ఈ మాదన్న బుధవారం పరిశీలించారు. గత కొన్ని సంవత్సరాలుగా నీలాపురం నుంచి సుగాలి తాండాకు వెళ్లే రోడ్డు అధ్వాన పరిస్థితిలో ఉండటంతో ఇటీవల దానిని ఉపాధి హామీ పనులతో చేపట్టారు. ప్రస్తుతం మెటల్ రోడ్డు పూర్తికాగా ఆ రోడ్డు పనులను ఎస్ఈ పరిశీలించారు. అలాగే నీలాపురం నుంచి సుగాలి తండాకు పోయే వంకకు కల్వర్టు నిర్మించవలసిందిగా పలుమార్లు సుగాలి తాండా వాసులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఇటీవల ప్రభుత్వం కల్వర్టు నిర్మాణానికి గాను 25 లక్షల రూపాయలు మంజూరు చేసింది. ఆ నిధులతో కల్వర్ట్ నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. అలాగే మండల కేంద్రమైన దువ్వూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్మిస్తున్న స్మార్ట్ కిచెన్ సెంటర్ను ఎస్ఈ పరిశీలించారు. పాఠశాలలు ప్రారంభమయ్యే రోజు నుంచి దీనిని వినియోగంలోకి తేవాలని పేర్కొన్నారు. ఆయన వెంట డిఈ మధుసూదన్ బాబు, ఏఈ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలో ఉర్దూ జూనియర్ కలాశాలను ఏర్పాటు చేయాలి

కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ ఎస్ఎకె.బాషా



**మదనపల్లె, జూన్ 10 ప్రభాతవార్త :** అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లెలో మైనార్టీ విద్యార్థుల కోసం ఉర్దూ మీడియంలో ఇంటర్మీడియట్ చదువుకోవడానికి కోఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్కె.బాషా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఇంటర్మీడియల్లో ఉర్దూను అభ్యసించడానికి అవకాశాలు లేకపోవడం వల్ల ఉర్దూ చదువుకునే విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారన్నారు. తెలిపారు. బాలికలకు మదనపల్లె, రాయచోటిలో అందుబాటులో ఉందని బాలురకు మాత్రం గుర్రంకొండ మహాల్లో ఉందని తెలిపారు. జిల్లాలో మరెక్కడ కూడా లేకపోవడంతో జిల్లా కేంద్రమైన మదనపల్లెలో ఏర్పాటుచేయాలని తెలిపారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, డిఈఓలను కలిసి వినతిపత్రం అందచేయనున్నట్లు వారు తెలిపారు. చదువుకోవాలన్న ఆసక్తి గల విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

## నేడు విద్యుత్లైన్లు విభజన

**మదనపల్లె, జూన్ 10 ప్రభాతవార్త :** మదనపల్లె మండలంలోని నేడు వేంపల్లి, కొళ్ళబైలు, అమ్మచెరువుమిటట సబ్స్టేషన్లో వ్యవసాయ వినియోగదారులకు 3ఫేజ్ విద్యుత్ సమయం రాత్రి 0.00నుండి ఉదయం 10గంటల వరకు ఇవ్వబడుతాయని ట్రాన్స్కో ఈఈ గంగాధరం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33కెవి వేంపల్లి ఈ పీడర్ ఓవర్లోడు కావడంతో లైన్ విభజన పనులు చేస్తున్నామని తెలిపారు. కావులన వ్యవసాయ దారులు సహకరించాలని కోరమైందన్నారు.

# కార్యకర్తల సమస్యల పైన ప్రత్యేక దృష్టి

### మండల టిడిపి అధ్యక్షుడు సురేందర్ రెడ్డి




**..రామాపురం జూన్ 10 ప్రభాతవార్త:..** మండలంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమస్యల పైన తెలుగుదేశం పార్టీ అధిష్టాన నాయకత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని రామాపురం మండలం టిడిపి అధ్యక్షుడు గాలివీటి సురేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఆయన సోదరుడు నియోజకవర్గం టిడిపి నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు రామాపురం టిడిపి కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ కార్యకర్తల, సమస్యలు గ్రామాల్లోవారు సూచించే ప్రజా సమస్యల పైన చర్చించడానికి ప్రతి నెలలో మొదటి బుధవారం యూనిట్ స్థాయిలో జరిగినటువంటి తెలుగుదేశం పార్టీ విస్తృత సమావేశంలో కార్యకర్తలు సూచించిన సమస్యలను చర్చించి అక్కడ తీర్మానించిన సమస్యలను రెండో బుధవారం మండల స్థాయిలో మండల అధ్యక్షుడి ఆధ్వర్యంలో క్లస్టర్ యూనిట్ బూత్ కమిటీల తో సమావేశం పెట్టి యూనిట్ స్థాయి తీర్మానాలును చర్చించి మూడో బుధవారం నియోజకవర్గ స్థాయిలో జరిగే సమావేశాల్లో ప్రవేశపెడతారని అక్కడ చర్చించి నిర్ణయించిన తీర్మానాలను నాలుగో బుధవారం పార్లమెంట్ స్థాయిలో జరిగే సమావేశాలకు తీసుకువెళ్తారని ఈ పద్ధతి వలన ప్రతి కార్యకర్త గుర్తించిన ప్రజా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ఈరోజు మండల స్థాయిలో జరిగిన సమావేశంలో మండలంలోని అన్ని గ్రామాల చెరువులకు వెలిగల్లు నుండి సాగునీరు నింపాలని, ఎస్సీ ఎస్టీ కాలనీలలో డ్రైనేజ్ రోడ్ల సమస్యలకు పరిష్కరించేందుకు ఎస్సీ సబ్ ప్లాన్ కింద నిధులు మంజూరు చేయించాలని, తదితర సమస్యలను గుర్తించి నియోజకవర్గ సమావేశాలకు తీర్మానాలను పంపించడం జరిగిందన్నారు. ఈ ఈ సమావేశంలో క్లస్టర్ యూనిట్ ఇన్చార్జిలు సయ్యద్ మహబూబ్ బాషా,సహదేవ రెడ్డి, ఆజాం , చెన్నూరు బాబు, రెడ్డి బాబు, క్లస్టర్ యూనిట్ పరిధిలోని బూత్ కమిటీ కన్వీనర్లు కో కన్వీనర్లు టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి సారించాలి

### ఎంపీడీవో శివశంకర్



**పీలేరు, జూన్ 10 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో జి. శివశంకర్ అన్నారు. బుధవారం స్వచ్ఛపథం కార్యక్రమంలో భాగంగా బోడుమల్లువారిపల్లె పంచాయతీ పరిధిలో విస్తృతంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో లింకు రోడ్డులలో కూడలిలో పిచ్చి మొక్కల తొలగింపు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. తడి, పొడి చెత్తలు వేర్వేరుగా సేకరించి. తడిచెత్తను చెత్తసంపద కేంద్రానికి తరలించి ఎరువుగా తయారు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో యుగందర్, పంచాయతీ కార్యదర్శులు లీపిక, జ్ఞానశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీ వృద్ధురాలి పరిస్థితి విషమం



**కురబలకోట జూన్ 10 ప్రభాతవార్త** అన్నమయ్య జిల్లాతంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట మండలం ముదివేడు వద్ద బుధవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ వృద్ధురాలి పరిస్థితి విషమించింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సుమారు 70 సంవత్సరాల వయసున్న గుర్తుతెలియని వృద్ధ మహిళను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడి రక్తపు మడుగులో పడి ఉండడాన్ని గుర్తించా మన్నారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సకాలంలో బాధిత మహిళను ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాలు కాపాడే అవకాశం ఉందని స్థానికులు పేర్కొన్నారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

## ఉద్యాన అధికారిణిగా దీప

పులివెందుల, జూన్ 10, ప్రభాతవార్త :



పులివెందుల ఉద్యాన శాఖ కార్యాలయంలో నూతన ఉద్యాన అధికారిణిగా శ్రీమతి బి. దీప బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పులివెందుల ఇన్‌చార్జ్ ఉద్యాన అధికారిగా విధులు నిర్వహించిన రాఘవేంద్ర రెడ్డి నుంచి ఆమె బాధ్యతలు చేపట్టారు. బి. దీప గతంలో ఏలూరు జిల్లాలో సాంకేతిక ఉద్యాన అధికారిణిగా సేవలందించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆమె పులివెందుల రెగ్యులర్ ఉద్యాన అధికారిణిగా నియమితులై బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పులివెందులలో విధులు నిర్వహిస్తున్న ఉద్యాన అధికారి వేంపల్లికి బదిలీ కావడంతో ఈ మార్పు చోటుచేసుకుంది. ఈ సందర్భంగా నూతన ఉద్యాన అధికారిణి బి. దీప మాట్లాడుతూ, పులివెందుల ప్రాంతంలో ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో విస్తారంగా సాగవుతున్న అరటి పంటకు మార్కెట్ అవకాశాలను పెంచి, అరటి ఎగుమతులను ప్రోత్సహించే దిశగా ప్రత్యేక చర్యలు చేపడతానని చెప్పారు. రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకువచ్చి ఉద్యాన రంగ అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

## డీఎస్సీ పై, వైసిపి నాయకులు అసత్య ప్రచారాలు

### మార్కెట్ కమిటీ చైర్పర్సన్ ప్రతినిధి డేరంగుల శ్రీకాంత్

సిద్ధవటం, జూన్ 10 ప్రభాతవార్త



వైసిపి నాయకులు నిత్యం, అసత్య ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నారని దానికి కేరాఫ్ అడ్రస్‌గా వైసిపి మారిందని జనసేన పార్టీ సిద్ధవటం వ్యవసాయ మార్కెట్ ప్రతినిధి డేరంగుల శ్రీకాంత్ పేర్కొన్నారు, బుధవారం ఆయన మండలంలోని మాధవరం, 1 రామకృష్ణాపురం గ్రామం తన నివాసంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల కాలంలోనే మెగా డిఎస్సిని అత్యంత పారదర్శంగా నిర్వహించారని మెగా డీఎస్సీ నిర్వహణపై వైసిపి నాయకులు పనిగట్టుకొని అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు నిరుద్యోగుల భవిష్యత్తుతో ముడిపడిన దానిపై దుష్ప్రచారం చేయడం తక్షణమే మానుకోవాలని తెలిపారు గత వైసిపి ప్రభుత్వ పాలనలో నిరుద్యోగులకు మెగా డీఎస్సీ అనేది ఒక కలగానే మిగిలిపోయింది అన్నారు ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూసిన నిరుద్యోగుల ఆశలను గత వైసిపి ప్రభుత్వం ఆడియాశలు చేసిందన్నారు, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృతంలో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ డీఎస్సీని విజయవంతంగా నిర్వహించి తద్వారా నిరుద్యోగుల కళ్ళల్లో ఆనందాన్ని కూటమి ప్రభుత్వం నింపిందన్నారు అత్యంత పగడ్బందీగా నిర్వహించిన మెగా డీఎస్సీ పై ఆరోపణలు మానుకోవాలని తెలిపారు

## హిజ్రాలకు కౌన్సిలింగ్ ఇచ్చిన పోలీసులు



సిద్ధవటం, జూన్ 10 ప్రభాతవార్త

కడప చెన్నై జాతీయ రహదారి కనుమలోపల్లె సమీపాన, శనీశ్వర స్వామి గుడి వద్ద వాహనాలు నిలుపుదల చేసి ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని స్థానిక పోలీసులు హిజ్రాలను హెచ్చరించారు మండలంలోని కడప చెన్నై జాతీయ రహదారి శ్రీ మందగిరి శనేశ్వర స్వామి గుడి వద్ద వాహనాల రాకపోకలు అంతరాయం కలిగిస్తున్నారని బుధవారం 100 డయల్ కు ప్రయాణికులు ఫిర్యాదు చేయడంతో మండల ఎస్సై హారిక ఆధ్వర్యంలో హిజ్రాలకు స్థానిక పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు నేషనల్ హైవేపై వాహనాలను నిలుపుదల చేసి ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హైవే రోడ్డుపై అత్యవసర చికిత్సల సేవల కోసం అంబులెన్స్ లో పేషెంట్లను తీసుకెళ్తుంటాయని వాహనాలు నిలుపుదల చేయవద్దని తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

## సర్ ప్రోగ్రాం గురించి చర్చ



సిద్ధవటం, జూన్ 10 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జి చమర్తి జగన్ మోహన్ రాజు ఆధ్వర్యంలో సిద్ధవటం మండలం తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో బుధవారం మండల నాయకులతో సమావేశం జరిగినది, మండల బూత్ కమిటీ లు, మరియు కార్యకర్తలు పాల్గొని సర్ గురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమం లో మండల పార్టీ అధ్యక్షుడు రాజశేఖర్ యాదవ్ క్లస్టర్ ఇన్చార్జి రాజానాయుడు సర్ ప్రోగ్రాం గురించి మాట్లాడుతూ ఓటర్ లిస్టు ప్రక్షాళన చేయడమే దీని యొక్క ముఖ్య ఉద్దేశం ఓటర్ లిస్టులో ఉన్న తప్పులు దొంగ ఓట్లు వీటిని సరి చేయడం అని వివరించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నాగమునిరెడ్డి మాజీ ఎంపీపీ రామిరెడ్డి నరసింహారెడ్డి మాజీ జెడ్పిటిసి చలమయ్య యాదవ్ రైతు విభాగపు కార్యదర్శి మల్లు వెంకటసుబ్బారెడ్డి పిచ్చిరెడ్డి టిడిపి సీనియర్ నాయకులు మార్కెట్ యాడ్ వైస్ చైర్మన్ ప్రతినిధి పార్ల రాంప్రసాద్ చెంచయ్య నాయుడు మాజీ సర్పంచ్ ప్రతినిధి భాస్కర్ రెడ్డి పార్ల శ్రీనివాసులు భవనాసి పవన్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## యాదాల వారి పంక్షన్‌లో

## మఠాధిపతి రాజకీయ ప్రముఖులు

బ్రహ్మంగారిమఠం జూన్ 10 ప్రభాతవార్త

మండలంలోని ప్రముఖ వ్యాపారవేత్త యాదాల వెంకటసుబ్బయ్య కుమార్తె యాదాల వైష్ణవి ఓణీల పంక్షన్ వేడుకల్లో బ్రహ్మంగారిమఠం మఠాధిపతి శ్రీ వీర దర్మజ వెంకటాద్రి స్వామి ధర్మపత్ని ఉమాదేవి వారి తమ్ముళ్ల వీరం భట్లయ్య స్వామి, దత్తాత్రేయ స్వామి, చిరంజీవి వైష్ణవి ఆశీర్వదించారు. అలాగే మండలం లోని రాజకీయ ప్రముఖులు ఎంపీపీ వీరనారాయణరెడ్డి తెలుగుదేశం మండల సీనియర్ నాయకులు ముడమాల పోలిరెడ్డి, ఎస్సార్ శ్రీనివాసుల రెడ్డి, సోమిరెడ్డి పల్లె సహకార బ్యాంక్ చైర్మన్ ఎల్లటూరు సాంబశివరెడ్డి, పూజా శివయ్య ,మలినేని రామయ్య ,పెంచల్ రెడ్డి మేకల సుధాకర్ ,పాల్గొని చిరంజీవి యాదాల వైష్ణవిని ఆశీర్వదించారు అనంతరం ఏర్పాటుచేసిన విందు కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



## నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

చౌడేపల్లి, జూన్ 10 ప్రభాతవార్త

మండల కేంద్రమైన చౌడేపల్లిలో ఈనెల 11న ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి శివకుమార్ తెలిపారు. బుధవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ చౌడేపల్లి సంతగేటు వద్దగల సచివాలయం సమీపంలో కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. తిరుపతికి చెందిన శ్రీ వెంకటేశ్వరా అరవింద ఆసుపత్రి వారిచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఆపరేషన్‌కు ఎంపికయిన వారిని అదే రోజు మధ్యాహ్నం తిరుపతి తీసుకెళ్ళి శస్త్రచికిత్స చేయిస్తామన్నారు. రానుపోను రవాణా, భోజన వసతి ఉచితంగా కల్పిస్తారన్నారు. కంటి సమస్యలతో బాధపడే వారు ఆధార్ కార్డు నఖలు, ఫోన్‌ను వెంట తీసుకురావాలన్నారు.

## పరిశుభ్రతే లక్ష్యం-ప్రజారోగ్యమే పరమావధి



పారిశుద్ధ్య చర్యల్లో కార్మికులు అధికారులు

చౌడేపల్లి, జూన్ 10 ప్రభాతవార్త

పరిశుభ్రతే లక్ష్యంగా ప్రజారోగ్యమే పరమావధిగా పనిచేయాలని డిప్యూటీ ఎంపిడిఓ ఎస్.ఏ.గఫూర్ అన్నారు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ జరుగుతున్న చెత్త సేకరణ పనులను పర్యవేక్షించారు. పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకొంటేనే ఆరోగ్య భద్రత ఉంటుందని ప్రజలకు సూచించారు. ఐవిఆర్ఎస్‌ను గురించి వివరించారు. చౌడేపల్లి-పలమనేరు మార్గంలో స్వచ్ఛతపథంలో భాగంగా పిచ్చిమొక్కలను తొలగించారు. పట్టణంలోని పలు చోట్ల పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి శివకుమార్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై సమీక్ష



దువ్వూరు, జూన్ 10, ప్రభాతవార్త:

మండల పరిధిలోని 23 గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలనలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో మంచినీటి సమస్య వస్తుందని వెంటనే ప్రత్యేక అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఆ సమస్యను పరిష్కరించాలన్నారు. అలాగే పారిశుధ్యం పై దృష్టి పెట్టాలని ఎక్కడ కూడా వీధుల్లో కానీ, వేరే చోట్ల కాని నీరు నిల్వ ఉండకుండా చూడవలసిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. అలాగే వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు.

## మండల అభివృద్ధి అధికారిగా శ్రీ రమాదేవి

కాశినాయన జూన్ 10 ప్రభాతవార్త:

శ్రీ అవధూత కాశినాయన మం డల నూతన మండల పరిషత్ అ భివృద్ధి అధికారిగా బాధ్యతలు అం కిరెడ్డి శ్రీ రమాదేవి చేపట్టారు ఈ మె తొండూరు ఉప మండల అబి. వృద్ధి అధికారిగా విధులు నిర్వహి స్తూ పదోన్నతి పొంది శ్రీ అవధూత కాశినాయన మండలం నందు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బాధ్య తలు చేపట్టారు.



## సంక్షేమం, అభివృద్ధికి

## గీటురాయిగా నరేంద్రమోడీ పాలన

వేంపల్లి జూన్ 10 ప్రభాతవార్త

దేశ ప్రధాని నరేంద్రమోడీ ప్రధానిగా బాధ్యతలు తీసుకుని 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వేంపల్లె శ్రీ వల్లీ సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన తో కరోనా కష్టకాలంలో ఉచిత కరోనా వ్యాక్సిన్, ఉచిత బియ్యం అందించడం జరిగిందన్నారు. అలాగే 13 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా 12 సంవత్సరాలు ప్రధానిగా అలుపెరుగని దేశ సేవ చేస్తున్నారని అన్నారు. అగ్రవర్ణ పేదలకు 10!! రిజర్వేషన్లు, ట్రిపుల్ తలాక్,370 ఆర్టికల్ రద్దు లాంటి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు.58కోట్ల జన్ ధన్ ఖాతాలు, 58 కోట్లమందికి తితీబీతి ఖాతాలు,57కోట్లమందికి ముద్రా యోజన రుణాలు, స్వచ్ఛ భారత్ లోభాగంగా12కోట్లమందికి పైగా మరుగుదొడ్ల నిర్మాణం,పీఎం ఆవాస్ యోజన ద్వారా 4కోట్లమందికి ఇళ్ల నిర్మాణం చేయడం జరిగిందని అన్నారు. జల్ జీవన్ మిషన్ క్రింద15కోట్ల ఇళ్లకు త్రాగునీరు ఇవ్వడం జరిగిందనిఅన్నారు. దేశంలో 4 వేల కిలోమీటర్లు జాతీయ రహదారులను వాటి స్థాయి పెంచి 9 వేల కిలోమీటర్ల నిర్మాణం తో పాటు 60 దేశాలకు కరోనా వ్యాక్సిన్ పంపించడం, లాంటి అనేక కార్యక్రమాలు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత, మంజుల, కీర్తన, విశ్వహిందూ పరిషత్ జిల్లా నాయకులు విశ్వనాథ రెడ్డి, దివాకర్, సురేష్ జయన్న, ఆలయ ప్రధాన అర్చకులు గిరిస్వామీ, సింగనమల సాంబశివుడు పాల్గొన్నారు.



## జూద స్థావరంపై పోలీసుల దాడి

### ఎనిమిది మంది జూదరుల అరెస్ట్

### రూ.10,030 నగదు స్వాధీనం

పులివెందుల, జూన్ 10 , ప్రభాతవార్త :

పట్టణంలోని బ్రాహ్మణపల్లె రోడ్డులో నిర్వహిస్తున్న జూద స్థావరంపై పోలీసులు బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఎస్సై తిమోతి ఆధ్వర్యం లో పోలీసు సిబ్బంది కలిసి చేపట్టిన ఈ దాడుల్లో మొత్తం ఎనిమిది మంది జూదరులను అరెస్ట్ చేశారు.అరెస్టు చేసిన వారి వద్ద నుంచి రూ.10,030 నగ దును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తిమోతి తెలిపారు. జూదం నిర్వహి స్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో దాడులు చేపట్టగా, నిందితులు పేకాట ఆడుతూ పట్టుబడ్డారని చెప్పారు. అరెస్టు చేసిన వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రజలు చట్ట విరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, జూదం వంటి అసాంఘిక కార్య కలాపాలను అరికట్టేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు కొనసాగిస్తుందని ఎ స్సై పేర్కొన్నారు.

## ప్రభుత్వ స్థలంలో ఎటువంటి నిర్మాణాలు, చేపట్టారాదు

సుండుపల్లి, జూన్ 10, ప్రభాతవార్త :

మండల కేంద్రమైన సుండుపల్లె సచివాలయం సమీపంలో పురాతన సుండుపల్లెమ్మ అమ్మవారి పేరుతో దేవదాయ మరియు ధర్మదాయ శాఖ పరిధిలో ఆలయం ఉంది. ఆ ఆలయం శిదిలావస్థ కు చేరుకుంటుండడం తో సనాతన ధర్మ పరిరక్షకులు కొందరు కొంతకాలం క్రితం ఆలయం చుట్టూ ముళ్లపొదలు తొలగించి ఆలయానికి రంగులు, గేటు ఏర్పాటు చేయడంతో పాటు అమ్మవారి విగ్రహం పెట్టారు. ఆలయంలో దీపారాధన చేస్తున్నారు. ఆలయం వద్ద అమ్మవారికి ఉత్సవం చేయాలని హిందూ సోదరులు కొందరు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇది ఓర్వలేని మరో మతానికి చెందిన వారు అభ్యంతరాలు తెలుపుతూ అధికారులకు పిర్యాదు చేశారు. దీంతో ఆలయం సమీపంలో తహసీల్దార్ వేణుగోపాల్ తమ సిబ్బంది, ఎస్ఐ ఎస్‌కె ఎం హుస్సేన్ లతో కలిసి బుధవారం అక్కడికి వెళ్లి హెచ్చరిక బోర్డు నటించారు. పూజలలో భాగంగా టెంకాయ పట్టల పందిరి వేసుకుని మామిడి తోరణాలు కట్టుకోవాలని నిర్వాహకులు విన్నవించగా అలాంటివి వేయడానికి లేదని మీకు అవసరమైతే షామియానా వేసుకుని కార్యక్రమం చేసుకోవాలని ఎస్ ఐ హుస్సేన్ సూచించారు. పూజలకు ముందు రోజు తనకు సమాచారం ఇస్తే ఎలాంటి అడ్డంకులు లేకుండా చూస్తామని సూచించినట్లు భాజపా నాయకులు రమణ గౌడ్, నాగేశ్వర రావులు తెలిపారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ తాసిల్దార్ వినీత్ కుమార్ రెడ్డి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ జోతిర్మయి వి ఆర్ ఒ బసయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన బోర్డు వద్ద అధికారులు

## క్యాడర్ క్యాలెండర్ సమావేశం



సుండుపల్లె, జూన్ 10,ప్రభాతవార్త :

మండల పరిధిలోని టి డి పి కార్యాలయంలో మండల టి డి పి అధ్యక్షులు రమేష్ నాయుడు ఆధ్వర్యంలో క్యాలెండర్ సమావేశం ( క్షేత్రస్థాయి కార్యాచరణ ప్రణాళిక) నిర్వహించారు. అనంతరం మండల అధ్యక్షులు మాట్లాడుతూ ప్రతినెల నాలుగు బుధవారాలు పార్టీ శ్రేణులు తప్పనిసరిగా క్యాడర్ క్యాలెండర్ సమావేశానికి కచ్చితంగా హాజరుకావాలని తెలిపారు. కార్యక్రమానికి మండల టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో చిరుధాన్య విప్లవం

**చేయి చేయి కలిపితే చేతకానిది ఏముంటుంది? వీళ్లదీ అదేమాట. ఐదువేలమంది మహిళలు కాయగూరలు పండించి నగరాలకు ఎగుమతి చేశారు. ఫర్నిచర్ తయారుచేసి పట్టణాలకు పంపించారు. తాజాగా చిరుధాన్యాలని సామాన్యులకు చేరవచేస్తూ ఆరోగ్యానికి పట్టం కడుతున్నారు.**

జనగామ జిల్లాలోని కాకతీయ మహిళా సహకార సంఘం ఏం చేసినా అది తోటివారికి స్ఫూర్తినిస్తూనే ఉంది. కొవిడ్ తరవాత స్టేషన్‌ఘన్‌పూర్ ప్రాంతంలోని పల్లెల్లో ఒక కార్పొరేట్ సంస్థ సర్వే నిర్వహించింది, ఆశ్యర్యంగా ఒక్క తాటికొండ గ్రామంలోనే 600 బిపి, షుగర్ వ్యాధిగ్రస్థులున్నట్టు ఆ సర్వేలో తేలింది. ఈ విషయం తెలుసుకున్న కాకతీయ మహిళా సహకార సంఘం సభ్యులు.. అనారోగ్యం నుంచి కోలుకోవడానికి చికిత్స తో పాటు చిరుధాన్యాలతో స్వీట్లతో సహా అన్ని రకాల వంటలూ చేసు కోవచ్చని ముందుగా తమ సంఘ సభ్యులకే అవగాహన కల్పించారు. ఆ తరవాత నుంచీ మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ వంటిచోట్ల సేంద్రియ పద్ధతుల్లో పండించిన జొన్నలు, రాగులు, సజ్జలను నెలకోసారి లారీల్లో ఘన్‌పూర్ తెప్పించుకుంటున్నారు.

## సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సిద్దవటం జూన్ 10 ప్రభాతవార్త

సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, బ్యాంక్ ఫ్రాడ్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దవటం ఎస్సై పి హారిక సూచించారు. సిద్దవటం మండలంలోని శివునిపల్లిలో బుధవారం రాత్రి గ్రామసభ నిర్వహించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. చీటింగ్, ఫ్యాక్షన్, సోషల్ మీడియా దుర్వినియోగం వల్ల కలిగే నష్టాలు వివరించారు. శక్తిఖి యాప్ ను ఉపయోగించడం వల్ల పోలీసులు మహిళలకు కల్పించే రక్షణ గురించి వివరించారు. గ్రామాల్లో ప్రశాంతతను నెలకొల్పడం జరుగుతుందన్నారు. అలాగే చట్టాలపై అవగాహన కల్పించినట్లు ఎస్సై తెలిపారు.



## ఇసుక, మట్టి మాఫియాపై సమగ్ర విచారణ జరపాలి

బద్వేలు, జూన్ 10, ప్రభాతవార్త

బద్వేల్ నియోజకవర్గ కేంద్రం పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న భూ, ఇసుక, మట్టి మాఫియా కార్యకలాపాలపై ఉన్నతాధికారులతో ప్రత్యేక సమగ్ర విచారణ చేపట్టి, వారికి సహకరిస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు సంగటి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక భగత్‌సింగ్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత రెండేళ్ల కాలంలో బద్వేల్ ప్రాంతంలో భూ, ఇసుక, మట్టి మాఫియా విచ్చలవిడిగా సాగుతోందని ఆరోపించారు. ఈ అక్రమాలను అరికట్టాల్సిన రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం శ్రీనివాసపురం సమీపంలోని డంపింగ్ యార్డులో నిల్వ ఉన్న ఇసుక మాయమైందని, కోట్ల రూపాయల విలువైన ఇసుక అక్రమంగా విక్రయించబడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయని తెలిపారు. అలాగే బద్వేల్ పట్టణ పరిసర ప్రాంతాలు, రెడ్డిపల్లె, పెద్ద చెరువు వెనుక ప్రాంతం, మేకవారిపల్లి క్రాస్ సమీపంలోని తిప్పలు, వల్లలవారిపల్లె ప్రాంతాల్లో మట్టి, భూముల అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సెలవు దినాలు, రాత్రి వేళల్లో పెద్దఎత్తున మట్టి తరలింపు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇటీవల ఒక ప్రైవేట్ స్థలంలో అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న వాహనాలను తహసిల్దార్ సీజ్ చేసినప్పటికీ, మరుసటి రోజే అవి విడుదల కావడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ అక్రమ వ్యవహారాల్లో కింది స్థాయి రెవెన్యూ సిబ్బంది నుంచి పలువురు అధికారుల వరకు ప్రమేయం ఉందనే ఆరోపణలు ప్రజల్లో వినిపిస్తున్నాయని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్రత్యేక బృందంతో విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడిన వారితో పాటు వారికి సహకరించిన అధికారులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను చైతన్యవంతం చేసి పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.




### భారత ప్రధానులలో నెహ్రూకు స్వర్ణ పథకం, ఇందిరమ్మకు రజిత పథకం, మోడీకి కాంస్య పథకం.

## కాంస్య పథకానికి ఇంత ఆర్భాటం అవసరమా?

వేంపల్లి జూన్ 10 ప్రభాతవార్త

భారత ప్రధానమంత్రుల్లో ఎక్కువ కాలం పరిపాలించిన ప్రధానిగా పండిట్ నెహ్రు మొదటి స్థానంలో ఉండగా,ఇందిరమ్మ రెండవ స్థానంలో, నరేంద్ర మోడీ మూడవ స్థానంలో ఉన్నారని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ పండిట్ నెహ్రూ 1947 వ సంవత్సరం ఆగస్టు 15వ తేదీ నుంచి 1964 సంవత్సరం మే 27వ తేదీ వరకు 16 సంవత్సరాల 286 రోజులు భారత ప్రధానిగా సేవ చేసి ఎక్కువ రోజులు సేవ చేసిన ప్రధానిగా బంగారు పథకాన్ని సాధించారన్నారు. ఇందిరాగాంధీ 1966వ సంవత్సరం జనవరి 24 నుంచి 1977 సంవత్సరం మార్చి 24 వరకు, మళ్లీ 1980 సంవత్సరం జనవరి 14 నుంచి 1984 సంవత్సరం అక్టోబర్ 31 తేదీ వరకు 15 సంవత్సరాల 350 రోజులు భారత ప్రధానిగా సేవ చేసి ఎక్కువ రోజులు సేవ చేసిన ప్రధానిగా రజిత పథకాన్ని పొందారన్నారు. కాగా ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీ 2014 మే 26వ తేదీ నుంచి నేటి వరకు 12 సంవత్సరాల 14 రోజులు ప్రధానిగా సేవ చేస్తూ ఎక్కువ రోజులు సేవ చేసిన ప్రధానిగా మూడవ స్థానంలో ఉన్నారన్నారు. ఈ మాత్రం దానికే బిజెపి నాయకులు, ఎన్డీఏ నాయకులు సంబరాలు చేసుకోవడం, ఆర్భాటాలు హంగామా చేయడం హాస్యాస్పదమని తులసి రెడ్డి అన్నారు. భారత తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ నవభారత నిర్మాత. పునాది వేసింది నెహ్రు. దానిమీద తర్వాత వచ్చిన ప్రధానులు భవనాలు నిర్మించారు. పునాది వేసిన నాయకుని విస్మరించడం సమంజసం కాదు. పండిట్ నెహ్రు సాగునీటి ప్రాజెక్టులను ఆధునిక దేవాలయాలుగా వర్ణించారు. ఆయన పాలనలో బాక్రానంగల్, హిరాకుడ్,నాగార్జునసాగర్, దామోదర్ వ్యాలీ, తుంగభద్ర ప్రాజెక్టు లాంటి భారీ సాగునీటి ప్రాజెక్టులు నిర్మించబడ్డాయి. దీనివలన దేశంలో ఆహార ధాన్యాల కొరత తీరింది. నెహ్రూ పాలనలో భిలాయ్, దుర్గాపూర్, రూర్కెలా లాంటి ఉక్కు కర్మాగారాలు నిర్మించబడ్డాయి దీనివలన పారిశ్రామికంగా దేశం అభివృద్ధి సాధించింది. నెహ్రూ పాలనలో ఐఐటి, ఎయిమ్స్, సెయిల్, ఓఎన్జిసి, డిఆర్డిఓ, ఐఐఎం, ఇస్రో, బిహెచ్ఇఎల్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు నిర్మించబడ్డాయి. నెహ్రూ పాలనలో ఎలక్షన్ కమిషన్,ఎల్ఐసి ఏర్పాటయ్యాయి. అమెరికాలో రాజ్యాంగం అమలులోకి వచ్చాక 150 సంవత్సరాలకు, బ్రిటన్‌లో 750 సంవత్సరాల తర్వాత మహిళలకు ఓటు హక్కు కల్పించబడింది. కానీ పండిట్ నెహ్రూ నాయకత్వంలో రాజ్యాంగం అమలులోకి వచ్చాక మొదటి సార్వత్రిక ఎన్నికల నుండి మహిళలకు ఓటు హక్కు కల్పించబడింది. నెహ్రు సాధించిన విజయాలతో పోలిస్తే మోడీ పాలనలో సాధించిన విజయాలు చాలా స్వల్పం. ఒక మాటల్లో చెప్పాలంటే మోడీ పాలనలో వైఫల్యాలు కొండవీటి చేంతాడులా ఉన్నాయి. ఒక మాటలో చెప్పాలంటే మోడీ 12 ఏళ్ల పాలనలో ప్రజలకు అచ్చే దిన్ బదులు చచ్చేదినాలు వచ్చాయి. నెహ్రూ ప్రతిష్టను తగ్గించాలని బిజెపి నాయకులు ప్రయత్నించడం గర్హ నీయం.ఆకాశం మీద ఉమ్మివేస్తే అది తిరిగి తమ ముఖం మీదనే పడుతుందన్న నగ్న సత్యాన్ని బిజెపి నాయకులు గ్రహిస్తే మంచిదని తులసి రెడ్డి హితవు చెప్పారు.



## బ్రాహ్మణ కార్పొరేషన్‌ను బిసి వెల్ఫేర్ నుండి దేవాదాయ శాఖకు మార్చడం పట్లహర్షం

వేంపల్లి జూన్ 10 ప్రభాతవార్త

బ్రాహ్మణి కార్పొరేషన్ నుండి దేవాదాయ శాఖకు మార్చడం కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపు తున్నట్లు బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు పీవీయెస్ వి ప్రసాదరావు సూగురు రఘునాథరావు లు ఒక ప్రకటన లో తెలిపారు. గత సంవత్సరం నుండి ఇదే విషయం పై అనేక సార్లు వినతి పత్రాలు ఇచ్చామని ప్రభుత్వం మా విజ్ఞప్తి ని పరిగణలోకి తీసుకొని చర్యలు తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గతంలో దేవాదాయ శాఖ పరిధి లో ఉండిన బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ ను వైసీపీ హయాంలో బిసి వెల్ఫేర్ పరిధి లోకి తెచ్చారని దీనివలన బ్రాహ్మణులు కు సంబందించిన వినతులు పరిష్కారం కావడం ఇబ్బంది గా మారడం తో దేవాదాయ శాఖ కు మార్చాలని మొదటి సారిగా పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు కు వినతి పత్రం ఇచ్చామని అనంతరం జిల్లా ఇంచార్జి మంత్రి సవిత దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కి విద్యాశాఖ మాత్యులు లోకేష్ కు వినతులు ఇచ్చామని అన్నారు. అదే విధంగా బ్రాహ్మణ లకు సబ్సిడీ రుణాలు. గరుడ పథకం అమలు కోసం ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు.



# పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి





ఒంటిమిట్ట జూన్.10. ప్రభాతవార్త

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు అత్యున్నత స్థాయిలో ఉండేందుకు ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడి పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఒంటిమిట్ట మండలం రాచపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయుడు జమాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గ్రామంలోని పిల్లల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా పిల్లలతో, ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. తర్వాత సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు తల్లిదండ్రులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని పిల్లల భవిష్యత్తు కోసం విద్యా వ్యవస్థ ఉన్నత స్థానంలో ఉండేందుకు ప్రభుత్వ పాఠశాలలు తారాస్థాయిలో నిలిచేందుకు పిల్లల సంక్షేమర్థం విద్యా వ్యవస్థ ఎన్నో సంక్షేమ పథకాలు విద్యార్థుల ముంగిట ఉంచుతూ ఉందన్నారు .అనుభవం కలిగిన ఉన్నతమైన ఉపాధ్యాయుల చేత పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా మంచి విద్య అందిస్తోందన్నారు. బడి ఈడు పిల్లలకు ఉచితంగా పాఠ్యాంశ బుక్కులు, స్కూల్ డ్రెస్సు, బ్యాగు, షూస్ అందిస్తోందన్నారు. నాణ్యమైన రుచికరమైన మెనూ, కోడిగుడ్డుతో కూడిన భోజనాన్ని, రాగి జావ మధ్యాహ్న భోజన పథకం కింద పాఠశాలలో అందిస్తోందన్నారు. తల్లికి వందనం పథకాన్ని ప్రవేశపెట్టి సంవత్సరానికి ఒకసారి తల్లి ఖాతాలోకి ఖర్చుల నిమిత్తం డబ్బు జమ చేస్తోందని ఎటువంటి ఫీజు లేని విద్య అందిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు కలిగి ఉన్నాయని మంచి విద్య లభ్యమవుతుందని ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు ఎన్ని వసతులు ఉన్నాయో ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కలిగి ఉన్నాయన్నారు. పదవ తరగతి పరీక్షల ఫలితాలను ఒకసారి గమనిస్తే ప్రభుత్వ పాఠశాలలో విద్య ఏ విధంగా ఉందో అందరికీ అర్థమవుతుందన్నారు. కావున చిన్నారులకు ప్రభుత్వం అందించే పథకాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించి వారి భవిష్యత్తుకు పూల బాటలు వేయాలని ప్రభుత్వ పాఠశాలలకు గట్టి పునాదులు వేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహబూబ్ ఖాన్, మహేశ్వర్ రెడ్డి, సురేష్ కుమార్, నరసింహారావు, సుగుణ, కృష్ణకుమారి, రహమతునిషా తదితరులు పాల్గొన్నారు.

### భారత ప్రధానిగా మోడీ రికార్డు

# దేశ ప్రజల విశ్వాసానికి ప్రతీక

### బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నారిశెట్టి సుప్రజ

బద్వేల్ అర్బన్, జూన్ 10 ప్రభాతవార్త :



దేశంలో ఎన్నికైన ప్రధాన మంత్రుల్లో అత్యధిక కాలం పదవిలో ఉన్న ప్రధానిగా శ్రీ నరేంద్ర మోడీ బుధవారం సరికొత్త రికార్డు నెలకొల్పడం నవ భారత ఆవిష్కరణకు శుభ సూచకమని బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నారిశెట్టి సుప్రజ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే 26, 2014న ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన మోడీ, ప్రధానిగా విజయవంతంగా 4,399 రోజులు పూర్తి చేసుకున్నారని తెలిపారు. ఇప్పటివరకు దేశ ప్రధానులుగా చేసిన వారిలో మొదటి ప్రధాని స్వర్గీయ జవహర్‌లాల్ నెహ్రూ 4,398 రోజులు పదవిలో ఉండగా, తాజాగా మోడీ ఆ రికార్డును అధిగమించారని ఆమె గుర్తు చేశారు. "గత పన్నెండేళ్లలో ప్రధాని మోడీ నాయకత్వంలో దేశంలో పలు రంగాల్లో అనూహ్యమైన, సానుకూలమైన, ప్రజోపకరమైన మార్పులు సంభవించాయి. ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా మన దేశ ఖ్యాతి ఇనుమడించింది." అని సుప్రజ కొనియాడారు. ప్రజల ఆశలు, ఆకాంక్షల మేరకు వారు తనపట్ల ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ.. సమర్థ నాయకత్వం, సుపరిపాలన, సంస్కరణలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పటిష్ట అమలు ద్వారా మోడీ వరుసగా దేశ ప్రధానిగా ఎన్నికవడం విశేషమన్నారు.

## ప్లాస్టిక్ రహిత పంచాయతీకి సహకరించాలి



వేంపల్లె జూన్ 10 ప్రభాతవార్త

వేంపల్లె పంచాయతీని ప్లాస్టిక్ రహిత పంచాయతీగా మార్చేందుకు ప్రతి వ్యాపారస్తుడు సహకరించాలని పంచాయతీ స్పెషల్ అధికారి వెంకట సుబ్బయ్య, పంచాయతీ ఇన్ ఛార్జ్ ఈఓ రమణయ్య కోరారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో టిడిపి నేతలతో కలిసి ప్లాస్టిక్ నిర్మూలనపై స్పెషల్ అధికారి వెంకట సుబ్బయ్య, పంచాయతీ ఇన్ చార్జ్ ఈఓ రమణయ్యలు చర్చించారు. ఈ నెల ఆఖరు నాటికి వేంపల్లెలో దుకాణాలు పెట్టుకొన్న వ్యాపారస్తులు అందరూ ప్లాస్టిక్ కవర్లును పూర్తిగా విక్రయించుకోవాలని కోవాలని కోరారు. ప్లాస్టిక్ కవర్ల నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు దుకాణాదారులకు నోటిసుకు కూడ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జూలై 1 నుండి దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు విక్రయాలు చేస్తే అలాంటి దుకాణాల యాజమానులపై జరిమానాలు విధించి చర్యలు తీసుకొంటామని తెలిపారు. కాబట్టి ప్రతి దుకాణాదారుడు అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, మాట్లాడుతూ మన ఊరు మన వేంపల్లి అనే నినాదంతో ప్రతి ఒక్కరూ వేంపల్లి అభివృద్ధికి సహకరించాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నాం. ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, టిడిపి ఉపాధ్యక్షుడు వీరభద్ర, మొండోండ్ గౌస్, నామ వేమకుమార్ బిజెపి నాయకుడు గాలి హరిప్రసాద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# భూసార పరిరక్షణతోనే సుస్థిర వ్యవసాయం సాధ్యం

### ఆహార సాంకేతిక కళాశాలలో 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమం

పులివెందుల, జూన్ 10, ప్రభాతవార్త :

పులివెందుల ఆహార సాంకేతిక కళాశాలలో బుధవారం "ఖేత్ బచావో అభియాన్" (భూ ఆరోగ్య పరిరక్షణ ప్రచార కార్యక్రమం) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లింగాల మండల వ్యవసాయ అధికారి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేముల మండల డీఆర్‌డీఏ అధికారి డి. ఆంజనేయులు, స్నేహిత అమృత హస్తం అధ్యక్షులు రాజు ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం. మాధవ మాట్లా డుతూ, భూసార పరిరక్షణ, రసాయన ఎరువుల విని యోగ నియంత్రణ, సుస్థిర వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించడమే "ఖేత్ బచావో అభియాన్" ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పర్యావరణ సమతుల్యాన్ని కాపాడుకుంటూ రైతులు పంట దిగుబడులను పెంచుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారి రమేష్ మాట్లాడుతూ, సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు వ్యవసాయ ఉత్పాదకత కూడా పెరుగుతుందని తెలిపారు. నేల సారాన్ని కాపాడేందుకు రైతులు అనుసరించాల్సిన పలు పద్ధతులను వివరించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం చేపడితే సాగు వ్యయాలు తగ్గి, అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాప కులు ఇంజినీర్ నజ్మా, డాక్టర్ జయమ్మ, డాక్టర్ సాయి శ్రీనివాస్, ఎన్.వి. సుబ్బారెడ్డి, పీడీ డాక్టర్ రాజశేఖర్‌తో పాటు కామసముద్రం, పెద్దకుడాల, వేముల ప్రాంతాల రైతులు, కళాశాల విద్యార్థులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవ సాయ అధికారి రమేష్

## ఘనంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు

కలికిరి, జూన్ 10, ప్రభాతవార్త:

కలికిరి మేజర్ పంచాయతీలో బుధవారం స్వచ్ఛపథం కార్యక్రమంలో భాగంగా పంచాయతీ స్పెషలాఫీసర్ భానుమూర్తిరావు, ఈవో అశోక్‌ల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా కలికిరి–సోమల రోడ్డు మార్గంలోని రక్షిత మంచినీటి పైపులైన్లు మరమ్మతులు, అలాగే రోడ్డుకు ఇరువైపులా శుభ్రపరచడం, క్లీన్‌అండ్ గ్రీన్ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఎంపీడీవో భానుమూర్తిరావు స్వచ్ఛ పథం కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఆర్.యోగేష్‌రెడ్డి, బిల్ కలెక్టర్ పృద్వీరాజ్, శానిటేషన్ మేస్త్రి వెంకటముని, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



స్వచ్ఛపథం కార్యక్రమం దృశ్యం

### యోగాసనాల ద్వారా

# ఆరోగ్యం మెరుగు..

### దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో యోగేంద్ర కార్యక్రమం...

వేంపల్లె జూన్ 10 ప్రభాతవార్త

యోగాసనాల ద్వారా ఆరోగ్యం మెరుగు పడుతుందని వృషభ చలేశ్వర స్వామి దేవస్థానం ఈవో సుభాష్, ఆలయ చైర్మన్ పివి రమణ పేర్కొన్నారు. బుధవారం12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని దేవాదాయధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు వేంపల్లెలోని శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం అనుసంధానంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక యోగా కార్యక్రమాల్ని నిర్వహించారు .వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉదయం యోగా మాస్టర్ రామచంద్రచే భక్తులతో యోగాసనాలు చేయించారు. అనంతరం ధ్యానం చేయించి ధ్యానం యొక్క లాభాలు తెలిపారు. యోగాసనాలు చేయడం వల్ల మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు హరిప్రవీణ్, సహాయ అర్చకులు వేణు స్వాములు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### శరవేగముతో

# అభివృద్ధి పనులు

### పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నాగమునిరెడ్డి

సిద్ధవటం జూన్ 10 ప్రభాతవార్త

రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ జగన్ మోహన్ రాజు ఆధ్వర్యంలో సిద్ధవటం మండలంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నవి టక్కోలులో కాజీపల్లి గ్రామము శ్మశానవాటికకు వెళ్లే రహదారిని ప్రజలకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పార్లమెంట్ ఉపాధ్యక్షులు నాగమునిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని రోడ్డు అభివృద్ధి పనులను చేస్తున్నారు చేస్తున్నారు . ఈ సందర్భంగా బుల్డోజర్ మరియు వైబ్రేషన్ రోలర్ సహాయంతో రహదారిని లెవెల్ చేసి తీర్చిదిద్దే పనులు చేపట్టారు. కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు రహదారులు, తాగునీరు, పారిశుద్ధం మరియు డ్రైనేజీ సౌకర్యాల కల్పనకు నిరంతరం కృషి జరుగుతోంది అని ప్రజల సంక్షేమం – గ్రామాల అభివృద్ధి అనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుండగా, ప్రతి గ్రామంలో అభివృద్ధి ప్రజలకు చేరేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని నాగమునిరెడ్డి తెలిపారు ఈ కార్యక్రమం లో మాజీ విఆర్ఓ మునిరెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, చిన్నపురెడ్డి, వీరయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.



## జల సంరక్షణ సంకల్పాన్ని జలధార వలన సాధ్యమవుతుంది : కలెక్టర్ నిశాంత్ కుమార్

లక్కిరెడ్డిపల్లి జూన్ 10 ప్రభాతవార్త

జల సంరక్షణ సంకల్పాన్ని జలధార పథకం ద్వారా సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం పాలెం గొల్లపల్లె ప్రాంతంలోని కుక్కల గుట్ట నుండి మా చెరువు వరకు జల ధార కార్యక్రమం పనులు చేపట్టారు. ఈ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తొలకరి చినుకులకే కొండ ప్రాంతాలలో కురిసిన వర్షపునీరు చేరుకొని జలధార ద్వారా చేపట్టిన కుక్కల గుట్ట నుండి మా చెరువు వరకు వర్షపు నీరు చేరుకుందని ఈ జల ధార పథకం ఎంతో మంచిది అన్నారు వర్షపు నీటిని బయటకి పంపకుండా సరాసరి చెరువులోకి వచ్చేటట్లు ఏర్పాటు చేయడం వలన భూమి10 ఎంతో సారవంతమై బోరు బావుల్లో నీరు ఉంటుందన్నారు. ఈ మహోన్నత కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టడం చాలా గొప్ప విషయం అన్నారు. ఈ జల ఆధార కార్యక్రమం ఊరు భవిష్యత్తుకు బాటలు వేస్తుందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూడా ఈ జలా ధార పథకం ద్వారా చెరువుల కుంటలు తయారు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రెడ్డయ్య, తాసిల్దార్ క్రాంతి కుమార్, అసిస్టెంట్ ఇంజనీరింగ్ ఏఈ మహబూబాబాద్, ఆర్ ఐ రాజేష్, ఉపాధి హామీ పథకం ఏపీవో తిరుపాల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



చెరువులో ఉన్న నీటిని పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

## పండ్లు, పూల తోటలకు ప్రోత్సాహం





దువ్వూరు, జూన్ 10, ప్రభాతవార్త:

ఉపాధి హామీ పథకంలో పండ్లు, పూల తోటలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని వాటిని రైతులు వినియోగించుకోవాలని ఎంపీడీవో సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కృష్ణంపల్లె, బయనపల్లె, కానగూడూరు, మూడీళ్ల పల్లె తదితర గ్రామాల్లో రైతులు ఎక్కువగా జామ, నిమ్మ, చీని, సపోటా అలాగే మల్లె తోటలు సాగు చేస్తారని ఆ రైతులను కలిసి ఉపాధి హామీ ద్వారా వచ్చే వివిధ పథకాలను క్షేత్ర స్థాయి సిబ్బంది వివరించాలన్నారు. అలాగే శ్రామికుల సంఖ్య తక్కువగా ఉందని శ్రామికులను పెంచి రైతులకు అవసరమైన పంట కాలువలను చేయాలన్నారు. ఉపాధి హామీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో ఏపీఓ లక్ష్మీనారాయణ, ఈసీ ప్రియాంక పాల్గొన్నారు.

## యోగా దినచర్యలో ఒక భాగం కావాలి : డిప్యూటీ హెచ్ఈఓ

పీలేరు జూన్ 10 ప్రభాతవార్త

యోగా చేయడం రోజు వారి దినచర్య లో ఒక భాగం కావాలని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ అన్నారు. డి.ఎమ్‌హెచ్.ఓ. ఆదేశాల మేరకు అంతర్జాతీయ యోగా పక్షోచ్ఛావాలలో భాగంగా మండల కేంద్రంలోని 4 వ సచివాలయంలో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమం సందర్శించి అక్కడ హాజరైన తల్లులకు, సహాయకులకు యోగా ప్రాముఖ్యత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ మాట్లాడుచు చక్కటి జీవనశైలి పాటిస్తే రక్తపోటు,షుగర్, క్యాన్సర్, గుండెజబ్బులు, పక్షవాత ము వంటి జబ్బులను నియంత్రణ చేసుకోవచ్చునని తెలిపారు. ప్రస్తుతం ఉన్న యాంత్రిక జీవనంలో ప్రతీ ఇంటిలో సగటున ఒక బి.పి, షుగర్ రోగి ఉన్నారని అన్నారు. ఈ జీవన శైలి లోపం వల్ల వచ్చు వ్యాధులు బి. పి, షుగర్, గుండె జబ్బులు, కాన్సర్స్, పక్ష వాతం, స్తులకాయం, వీటికి కారణాలు వంశపారంపర్యంగా కూడా వచ్చే అవకాశం యాభై శాతం ఉంది మరియు ఎక్కువ ఒత్తిడికి గురి కావడం, ఆలోచనలు, ఆతృత, ఉప్పు ఎక్కువ వాడకం, సరైన వ్యాయామం లేక పోవడం, అతిగా తినడం, ఎక్కువ మాంసాహారం తినడం, నీరు తక్కువగా త్రాగడం వంటి పరిస్థితులు, పట్టణ వాతావరణం వంటివి దోహదం చేస్తాయి. కావున ఈ రకపు జీవన శైలి లోప వ్యాధులు రాకుండా లేదా నియంత్రణ చేసుకోవడానికి ఆరోగ్యకరమైన జీవన శైలి అలవాటు చేసుకోవాలి అనగా రోజు ఆసనాలు,చేయడం, అరగంట నడక, అరగంట యోగ చేయడం, ఎక్కువ నీరు త్రాగడం, ఆకుకూరలు, కాయగూరలు తినడం, మాంసాహారం తక్కువగా తినడం, పోగాకు, కట్లుపొడి, చుట్టలు బీడీ, సిగరెట్‌లు త్రాగారాదు, నమలరాదు. ఆల్కహాల్ త్రాగరాదు అని తెలిపారు. అనంతరం యోగ వల్ల ఒత్తిడి నియంత్రణ జరుగుతుంది. బి. పి. మరియు షుగర్ నియమిత స్థాయిలో ఉంచుకోవచ్చు. బాడీ ఫిటినెస్ ఉంటుంది అని తెలిపారు. అనంతరం గర్భిణీ లకు పౌష్టికాహారం సర్పంచ్, వైద్యులు పంపిణీ చేశారు. పౌష్టికాహార ప్రాముఖ్యత పై అవగాహన కల్పించి కరపత్రాలు అందచేశారు. అనంతరం లబ్దిదారులతో మహిళల భాగస్వామ్యం తో గ్రూప్ ఫోటో తీసుకోవడం జరిగింది. అదే సమయంలో ఈనెల 28న నిర్వహించబోవు పల్స్ పోలియో కార్యక్రమం లో అప్పుడే పుట్టిన బిడ్డ దగ్గర నుండి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని తల్లులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో సి. హెచ్.ఓ. శాంతి ,ఎమ్. ఎల్. హెచ్.గీత,పి ఏ. ఎన్. ఎమ్ లు రెడ్డీబి, అమ్మాజీ ఆశాకార్యకర్తలు దీన, లలిత పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమం

# పిచ్చికుక్క మూడు గ్రామాలలో వీరంగం

### 22 పశువులకు తీవ్ర గాయాలు... ముమ్మరంగా వైద్య సేవలు

తంబళ్లపల్లె జూన్ 10 ప్రభాతవార్త ః

ఓ పిచ్చి కుక్క వీరంగం సృష్టించి మూడు గ్రామాల ప్రజలు ముప్పు తిప్పలు పెట్టి గ్రామాలలోని 22 పశువులను గాయపరిచి సంచలనం సృష్టించి బెంబేలెత్తించిన సంఘటన కోసువారిపల్లి పంచాయతీలో వెలుగు చూసింది. పంచాయతీలోని దేవరబురుజు, సి కె దయ్యాలవారిపల్లి, మేకల వారి పల్లె గ్రామాలలో బుధవారం తెల్లవారుజామున ఓ పిచ్చి కుక్క వీరంగం సృష్టించి కనపడిన పశువులను విచక్షణ రహితంగా కరచి తీవ్రంగా గాయపరిచింది. తొలుత దేవంబురుజులో రెడ్డప్పరెడ్డికి చెందిన రెండు పశువులతో పాటు గ్రామంలో ఆరుబయట గల పలు పాడి ఆవులు, దూడలను గాయపరగా స్థానికులు తరిమి కొట్టగా అదే ఊపులో పక్కనే గల సీ.కే దయ్యాలవారిపల్లి లో సైతం పలువురు రైతులకు చెందిన పాడియావులు దూడలను గాయపరిచి చివరిగా మేకల వారి పల్లెలో మరోసారి విజృంభించి పాడి పశువులను గాయపరిచింది. మొత్తంగా మూడు గ్రామాలలో 16 పాడి ఆవులు, ఆరు పాడి దూడలను గాయపరిచింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు మూకుమ్మడిగా పిచ్చి కుక్కను వెంటాడి చంపేశారు. పిచ్చికుక్క కాటుకు గురైన పశువుల రైతులు ఆందోళనతో లబోదిబోమంటూ పశువుల డాక్టర్ కు ఫోన్లో ఫిర్యాదు చేశారు. మండల పశు వైద్యాధికారి విక్రం రెడ్డి యుద్ధ ప్రాతిపదికన పశు వైద్య సిబ్బందిని పై మూడు గ్రామాలకు పంపించి కుక్క కాటు పశువులకు ర్యాపిడ్ టీకాలను వేయడానికి పురమయించారు. పశు వైద్యాధికారి ఇందు, సిబ్బంది రమేష్, నాయక్ లు కుక్క కాటు బారిన పడిన పశువులకు ర్యాపిడ్ టీకాలు వేసి నెలరోజుల పాటు వర్షానికి తడవరాదని వైద్య సిబ్బంది సూచనలు, సలహాలు పాటించాలని రైతులకు సూచనలు ఇచ్చారు. కుక్క కాటు రైతులు లక్షలాది రూపాయల వ్యయంతో కొని వాటి పాల దిగుబడితో జీవనోపాధి సాగిస్తున్నామని పశువులకు ప్రాణాపాయం జరిగితే వాటినే నమ్ముకున్న మేము ఎలా బతకాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. పిచ్చికుక్క పశువులపై పడటం జరిగిందని అదే చిన్నారులు, మనుషులపై విజృంభిస్తే పరిస్థితి ఏంటని తలచుకొని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి కుక్కల స్వైర విహారం పై దృష్టి సారించి కుక్క కాటు పశువుల రైతులను ఆదుకోవడానికి అండగా నిలవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.





# ప్రభుత్వ ఆసుపత్రిలోనే గర్భవతులు పురుడు పోసుకోవాలి

సుండుపల్లె, జూన్ 10,ప్రభాతవార్త :

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గర్భవతుల ఆరోగ్యం కోసం చేయబట్టిన ..ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్.. కార్యక్రమం 10 సంవత్సరాలు,100 వారాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గర్భవతులతో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మండల టిడిపి నాయకులు చప్పిడి మహేష్ నాయుడు పాల్గొన్నారు. అనంతరం ప్రధాన వైద్యులు దిలీప్ కుమార్ మాట్లాడుతూ గర్భవతులు దూర ప్రాంతాల్లో వెళ్లే అవసరం లేకుండా మన ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భవతుల డాక్టర్ సంయుక్త ప్రతినెల 9, 10వ తేదీల్లో అందుబాటులో ఉండి గర్భవతులకు చికిత్స అందిస్తారని తెలిపారు. అనంతరం టిడిపి నాయకులు చప్పిడి మహేష్ నాయుడు మాట్లాడుతూ మండల పరిధిలోని గర్భవతులు దూర ప్రాంతాలకు వెళ్లి అధిక డబ్బులు ఖర్చు పెట్టుకోకుండా మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భవతులు డాక్టర్ దగ్గర చికిత్స తీసుకుని ఆరోగ్యవంతంగా ఉండాలని గర్భవతులకు తెలియజేశారు. అనంతరం గర్భవతులకు అన్నసంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఫర్హా బేగం, గర్భవతుల డాక్టర్ సంయుక్త, సిహెచ్ఓ రామకృష్ణ యాదవ్, ఫార్మసీ ఆఫీసర్ నటేష్ కుమార్, సూపర్వైజర్ సదాశివ, వైద్య సిబ్బంది, కాంచన రెడ్డన్న, రెడ్డి నాయక్, ఏఎన్ఎంలు,గర్భవతులు తదితరులు పాల్గొన్నారు.



## సైనిక్ కార్యాలయంలో విశ్రాంతి గదులు నిర్మించాలి

కడప కార్పొరేషన్ జూన్ 10 ప్రభాతవార్త:

నగరములోని సైనిక భవన్ లోని విశ్రాంతి గదులు శిథిలా వ్యవస్థకు చేరాయని కడప జిల్లా ఎక్స్ సర్వీస్ మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫౌండర్ కెవి.రావు అన్నారు. బుధవారం కడపలో ఆయన మాట్లాడుతూ కడప నగరంలోని జిల్లా సైనిక్ భవన్ లో విశ్రాంతి గది గత 20 ఏళ్లగా శిథిలా వ్యవస్థలో ఉన్నాయని తెలిపారు. అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదని చెప్పారు. ఈ విషయాలపై రాష్ట్ర గవర్నర్, ఏపీ రాష్ట్ర సైనిక్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సెక్రటరీ, హోం డిపార్ట్మెంట్ ఉమ్మడి కడప జిల్లా సైనిక్ సంక్షేమ అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది అన్నారు. కడప జిల్లా నలుమూల ప్రాంతాల నుంచి వచ్చే మాజీ సైనికులు, వీర నారీమణులు విశ్రాంతి తీసుకోవడానికి సైనిక్ కార్యాలయంలో విశ్రాంతి భవనం లేదని కూడా చెప్పారు. ఫ్లాగ్ డే ఫండ్స్ ఉపయోగించి విశ్రాంతి గదిని నిర్మించాలని కోరమన్నారు.

